‘సాధారణ’ భక్తులకు టికెట్!


- రూ.100 ఇవ్వాలని కోన సిబ్బంది ఒత్తిడి
- ధ్వజస్తంభం వద్ద నగదు వసూలు
- భక్తులు తిరగబడటంతో జారుకున్న వైనం
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

8 లో..

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు


గురువారం 21 ఆగస్టు 2025


- వైసీపీ హయాంలో మితిమీరిన రౌడీయిజం
- సుఫారీ తీసుకునే స్థాయికి ఎదిగిన రౌడీలు
- తాజా పరిణామాలతో దృష్టంతా నెల్లూరుపైనే!

రాష్ట్రంలోనే ప్రశాంతతకు నిలయమైన నెల్లూరు జిల్లా అశాంతికి, అరాచకాలకు అడ్డాగా మారిపోయింది. మరీ ముఖ్యంగా ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రౌడీయిజం పతాక స్థాయికి చేరుకుంది. రాజకీయ నాయకులే రౌడీలను పెంచి పోషించడంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. రాత్రి పూట ఒంటరిగా వెళుతున్న వారిని కత్తులతో బెది రించి డబ్బులు లాక్కొని వెళ్లే స్థాయికి రౌడీయిజం చేరుకుంది. ఇటీవల నమోదవుతున్న కేసులే ఇందుకు నిదర్శనం. తాజాగా జరుగుతున్న పరిణామాలతో రాష్ట్రంలోని అందరి చూపు నెల్లూరుపైనే పడింది. అసలిక్కడ ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది. ఈ పరిస్థితులను పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. నెల్లూరులో అలజడులు రేపుతున్న అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతోంది. రౌడీయిజంపై ప్రధానంగా దృష్టి సారించి, రౌడీమూకల ఆగడాలను అణచివేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

రౌడీయిజంపై ఉక్కుపాదం!

- ప్రణాళిక రూపొందించిన పోలీసు శాఖ
- ఎస్పీని పిలిచి మాట్లాడిన డీజీపీ





గడిచిన కొన్నేళ్లుగా నెల్లూరులో రౌడీయిజం పెచ్చుమీరుతోంది. వైసీపీ హయాంలో నాయకులకు ప్రధాన అనుచరులుగా ఈ రౌడీలు చలామణి అయ్యారు. వారి అండతో కొత్తగా అనేక మంది ఈ రౌడీ గ్యాంగుల్లో చేరుతూ వస్తున్నారు. మైనర్లు కూడా ఈ జాబితాల్లో ఉండటం గమనార్హం. జిల్లా మొత్తం సుమారు వెయ్యి మంది రౌడీషీటర్లు ఉండగా, వారిలో ఒక్క నెల్లూరు నగర పరిధిలోనే 500 మందికిపైగా ఉన్నారు. సస్పెక్ట్ షీట్లు ఉన్న వారు ఇంతకు రెట్టింపు ఉండడం గమనార్హం. ఈ రౌడీషీటర్ల మూలంగా గడిచిన రెండు, మూడేళ్లలో పదుల సంఖ్యలో హత్యలు జరిగాయి. చిన్న వివాదాలకు కూడా సామాన్యులను చంపేయడం సంచలనం సృష్టించింది. నెల్లూరు రౌడీలు జిల్లా దాటి పక్క రాష్ట్రాల్లో కూడా సుఫారీ హత్యలు చేసే స్థాయికి ఎదిగారంటే పరిస్థితులు ఎంతలా దిగజారాయో అర్థం చేసుకోవచ్చు. ఒంగోలులో టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య, హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగి నాయక్ హత్య కేసుల్లో ప్రధాన నిందితులు నెల్లూరుకు చెందిన ముఠాలే కావడం గమనార్హం. ఈ రౌడీషీటర్లకు అనుచరులుగా చేరుతున్న వ్యక్తులు తొలి దశలో దారి దోపిడీలతో మొదలుపెడుతున్నారు. కొందరు ఆకతాయిలు అయితే ఏకంగా కత్తులు వెంట బెట్టుకొని తిరుగుతూ సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

● ఎస్పీకి డీజీపీ పిలుపు


జిల్లాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఎస్పీ కృష్ణకాంత్‌కు డీజీపీ కార్యాలయం నుంచి పిలుపు అందింది. బుధవారం ఆయన డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను కలిసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు సంబంధించి అనేక అంశాలపై వారు చర్చించినట్లు సమాచారం. ప్రధానంగా రౌడీషీటర్లు, రౌడీగ్యాంగ్‌ల ఆగడాలు, సెటిల్‌మెంట్లపై దృష్టి పెట్టాలని డీజీపీ సూచించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో నిడిగుంట అరుణ, జీవిత ఖైదీ శ్రీకాంత్ వ్యవహారాలపై కూడా తాజా పరిస్థితులను డీజీపీకు ఎస్పీ వివరించినట్లు సమాచారం. ఈ సమావేశం తర్వాత పోలీసు శాఖలో పరిస్థితులు వేగంగా మారే అవకాశాలు ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

\- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

గోదాములో ‘ఇంటి’ దొంగలు

- 900 కిలోల స్టీల్ తరలింపు
- వెంబడించి పట్టుకున్న పోలీసులు
- అధికారులపై అనుమానాలు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే స్థానిక హౌసింగ్ శాఖ గోదాము వద్ద నిల్వ చేసిన స్టీల్ (ఇనుప చువ్వ)ను గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో బుధవారం అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. దుత్తలూరు ఏసీ కాలనీ సమీపంలోని హౌసింగ్ గోదాము ఆవరణలో ఉన్న గృహ నిర్మాణాలకు ఉపయోగించే స్టీల్‌ను ఓ వాహనంలో గుర్తుతెలియని వ్యక్తులు లోడ్ చేస్తున్నారు. స్థానికులు వారిని ప్రశ్నించగా పొంతలేని సమాధానం ఇచ్చారు. దీంతో వారు హౌసింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి ఫొటోలు పంపారు. వెంటనే అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేయడంతో సీతారామపురం మండలం పోలంగారిపల్లి వద్ద వాహనాన్ని గుర్తించి స్టీలును స్వాధీనం చేసుకుని దుత్తలూరు స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను విచారించగా తనకేమీ తెలియదని, ఉదయగిరికి చెందిన హౌసింగ్ అధికారి తన వాహనాన్ని బాడుగకు పిలిస్తే వచ్చినట్లు చెప్పారు. కాగా వాహనంలో సుమారు 900 కిలోల బరువు కలిగిన రూ.60 వేలు విలువ చేసే 16 కట్టల స్టీల్‌ను గుర్తించారు. ఈ వ్యవహారం వెనుక హౌసింగ్ శాఖకు చెందిన అధికారుల ప్రమేయం ఉన్నట్లు బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ అధికారిని, మరికొంతమందిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా విషయం తెలుసుకున్న హౌసింగ్ ఈఈ నారాయణరెడ్డి, డీఈ పీరాన్ దుత్తలూరుకు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్టీల్ తరలింపులో శాఖాపరంగా విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వారు తెలిపారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా స్టీల్ తరలిస్తున్న వాహనం

రూ.2 కోట్ల ఎర్రచందనం పట్టివేత

● కావలిలో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం/కావలి రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కావలి జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.2 కోట్ల విలువ చేసే 83 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, లారీని సీజ్ చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఐ సాయి గిరిధర్, ఆర్‌ఎస్‌ఐ లింగాధర్ బృందం, కావలి టూటౌన్, వన్‌టౌన్, రూరల్ పోలీసుల సహకారంతో మంగళవారం రాత్రి నుంచి విజయవాడ-చెన్నై రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో రెండు కార్లు, ఒక లారీ అటువైపు వేగంగా వచ్చాయి. టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించిన రెండు కార్లు యూటర్న్ చేసుకుని వెనక్కి వెళ్లిపోయాయి. టాస్క్‌ఫోర్సు పోలీసుల పైకి లారీ దూసుకురాగా.. అప్రమత్తమైన సిబ్బంది తప్పించుకుని లారీని వెంబడించారు. లారీలోని వ్యక్తులు దూకి పారిపోగా ఒకరిని పట్టుకోగలిగారు. ఆ స్మగ్లర్ హరియాణాకు చెందిన వాడిగా విచారణలో తేలింది. లారీలో పరిశీలించగా 83 ఎర్రచందనం దుంగలు లభించాయి. రెండున్నర టన్నుల బరువున్న ఈ దుంగల విలువ రూ.రెండు కోట్ల వరకు ఉంటుందని అంచనా. పట్టుబడ్డ స్మగ్లర్‌ను దుంగల సహా లారీని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనవరికల్లా అభివృద్ధి పనులు పూర్తవ్వాలి

● అధికారులకు డీఆర్‌ఎం ఆదేశాలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు జనవరికల్లా పూర్తిచేయాలని విజయవాడ డీఆర్‌ఎం (డివిజనల్ రైల్వే మేనేజర్) మోహిత్ సోనాకియా రైల్వే అధికారులను ఆదేశించారు. డీఆర్‌ఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి నెల్లూరుకు వచ్చారు. తొలుత ప్రధాన రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పథకం పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తిచేసి జనవరికల్లా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం బిట్రగుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా ఆయన పరిశీలించారు.

ఇసుక బుకింగ్‌లో అడ్డగోలు నిర్ణయాలు

ఇసుక కష్టాలు మళ్లీ మొదలైనట్టే!

ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో తీసుకొచ్చిన ‘ఉచిత ఇసుక పాలసీ’కి కొందరు మైనింగ్ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. సాఫీగా సాగిపోతున్న ఇసుక బుకింగ్ విధానంలో అడ్డగోలుగా మార్పులు చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. ఒక భవన నిర్మాణదారుడు నెలకు ఒక లోడ్ ఇసుక మాత్రమే తీసుకెళ్లాలంటూ నిబంధన విధించారు. రెండో లోడ్ బుకింగ్ చేసుకునేందుకు వీల్లేకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. మూడు రోజుల క్రితం ఈ మార్పులు చేయగా, అప్పటి నుంచి నిర్మాణదారులకు కష్టాలు మొదలయ్యాయి. ఈ కొత్త నిబంధనలతో ప్రజల నుంచి జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు క్యూ కడుతున్నాయి.




- ఒక్కొక్కరికి నెలకొక బుకింగ్ మాత్రమేనట!
- ఒక లోడ్‌ను నెల మొత్తం సర్దుకోవాలంటూ నిబంధన
- మైనింగ్ అధికారుల తీరుపై విమర్శలు
- ప్రభుత్వ ‘ఉచిత పాలసీ’కి తూట్లు

నెల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :చిన్నపాటి ఇళ్లు నిర్మించుకోవాలన్నా కనీసం పది ట్రాక్టర్ల ఇసుక అవసరమవుతుంది. అలానే పెద్ద నిర్మాణాలకు దాని స్థాయిని బట్టి ఇసుక వినియోగం జరుగుతుంటుంది. ప్రస్తుతం సీజన్ కావడంతో భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అక్టోబరు నుంచి వర్షాకాలం కావడంతో ఆలోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని చాలా మంది తొందరపడుతున్నారు. అయితే ఇప్పుడు ఇసుక బుకింగ్‌లో రాష్ట్ర మైనింగ్ అధికారులు చేసిన మార్పులతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటివరకూ ఇసుక అవసరమైన వ్యక్తులు వెబ్‌సైట్‌లో అన్ని వివరాలతో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వారి ఇళ్లు లేదా భవనం ప్లాన్‌ను బట్టి ఇసుకను బుకింగ్ చేసుకునేందుకు ఇప్పటివరకూ అవకాశం ఉండేది. అంటే ఇంటి నిర్మాణదారుడు ఒక నెలలో తనకు సరిపడినంత ఇసుకను తీసుకెళ్లేందుకు అవకాశముండేది. కానీ కొత్త నిబంధనలతో ఒక వ్యక్తి నెలలో ఒక లోడ్‌ను మాత్రమే బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. అంటే ఒక ట్రాక్టర్ లేదా టిప్పర్ ఇసుకను ఇప్పుడు బుకింగ్ చేసుకుంటే, మరో నెల రోజుల వరకూ ఆ వ్యక్తికి ఇసుక దొరకదన్నమాట!

● నిర్మాణ పనులకు ఆటంకం

కొత్త నిబంధనతో చాలా మంది నిర్మాణదారులకు ఇసుక దొరక్క నిర్మాణాలు ఆపేసుకుంటున్నారు. అత్యవసరమైన వారు ఎక్కువ ధరకు బ్లాక్‌లో కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు, సంగం, విరువూరు, సూరాయపాలెం, పడమటికంభంపాడు ప్రాంతాల్లోని యార్డుల నుంచి ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు అక్టోబరు 15వ తేదీ వరకూ నదుల్లో ఇసుక తవ్వకాలు జరపకూడదు. దీంతో ట్రాక్టర్లు కూడా ఈ యార్డుల నుంచే ఇసుకను కొనుగోలు చేస్తున్నాయి. సాధారణంగా ప్రతి యార్డు నుంచి సరాసరి రోజుకు 300 నుంచి 400 టన్నుల ఇసుక విక్రయాలు జరుగుతుండగా, గడిచిన మూడు రోజుల నుంచి అది సగానికి పడిపోయినట్లు తెలుస్తోంది. ఇసుక కోసం యార్డుల వద్దకు వచ్చాక వారికి బుకింగ్ జరగకపోవడంతో తిరిగి వెనక్కు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. కాగా బుకింగ్ సమయంలో ఓటీపీ సమస్య కూడా తీవ్రంగా ఉన్నట్లు రవాణాదారులు చెబుతున్నారు. సకాలంలో ఓటీపీ రావడం లేదని, వచ్చినా వెంటనే సమయం మించిపోతోందని అంటున్నారు. కేవలం ఒక నిముషంలో ఓటీపీ ఎంటర్ చేయకపోతే ఆ బుకింగ్ రద్దవుతోందని వాపోతున్నారు. రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారులు ఉచిత ఇసుక పాలసీను అభాసుపాలు చేయాలన్న కుట్రతోనే ఇటువంటి నిబంధనలు పెడుతున్నారంటూ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కాగా దీనిపై మైనింగ్ డీడీ శ్రీనివాసరావును వివరణ కోరగా, నెలకొక బుకింగ్ చేసుకోవాలన్న నిబంధన రెండు రోజుల క్రితమే వచ్చినట్లు చెప్పారు. దీనిపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఆ విషయాన్ని రాష్ట్ర అధికారులకు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు.



ఒక ఐడీతో నెలకు ఒక బుకింగ్ మాత్రమే చేసుకోవాలంటూ చూపుతున్న వెబ్‌సైట్

అనధికార పొగాకు పరిస్థితి ఏంటి!?

- త్వరలో ముగియనున్న కొనుగోళ్లు!
- అనధికార పొగాకుకు అనుమతి ఏదీ?
- నిలిచిన కలిగిరి.. అదేదారిలో కందుకూరు, డీసీ పల్లి
- అపరాధ రుసుముపైనా కొనసాగుతున్న సస్పెన్స్
- పొగాకు రంగు మారుతోందని రైతుల ఆందోళన

కందుకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్న పొగాకు రైతులను కొత్త సమస్య వెంటాడుతోంది. ధర లేక నోబిడ్‌లు, సీఆర్‌లతో పొగాకు వేలంలో విపరీతమైన జాప్యం జరిగి ఇప్పటికే రంగుమారి నష్టపోయిన రైతులకు అనధికారిక పొగాకు అమ్మకాలకు అనుమతులు రావడంలో జాప్యం జరుగుతోంది. ఏటా ఆగస్టు నెలాఖరు నాటికి పొగాకు విక్రయాలు అనధికారిక పొగాకుతో సహా దాదాపుగా పూర్త య్యేవి. సెప్టెంబరు ద్వితీయార్థం నుంచి పొగనాట్లు సీజన్ మొదలయ్యేది. కానీ ఈ ఏడాది నేటికీ అధికారిక పొగాకు విక్రయాలే పూర్తికాకపోగా మార్గదర్శకాలు కూడా విడుదలకాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతు న్నారు. జిల్లాలో ఇప్పటికే కలిగిరి వేలం కేంద్రంలో అధికారిక పొగాకు అమ్మకాలు పూర్తవ డంతో ఆ వేలం కేంద్రం ప్రస్తుతం నిలిచిపోయింది. కందుకూరు-2 వేలం కేంద్రంలోనూ ఈ వారంలో అధికా రిక పొగాకు అమ్మకాలు పూర్తవు తుండగా డీసీ పల్లిలో కూడా రెండు మూడు రోజుల్లో అధికారిక పొగాకు అమ్మ కాలు పూర్తవుతాయని, కందుకూరు-1లో మరో పది రోజుల్లో పూర్తవుతుందని బోర్డు అధికారులు తెలిపారు.

● 60 శాతంపైగా అనధికారిక పొగాకు

గత రెండేళ్లలో పొగాకు సాగు లాభసాటిగా ఉండటంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగటం, వాతావరణం అనుకూలిం చడంతో దిగుబడులు పెరిగి అనుమతించిన పొగాకు కన్నా దాదాపు 60శాతం వరకు అదనంగా పొగాకు ఉత్పత్తి జరిగింది. కందుకూరు-1లో 11 మిలియన్లకు పొగాకు బోర్డు అనుమతించగా 18 మిలియన్ల వరకు పొగాకు ఉత్పతి జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు 10.2 మిలియన్ల పొగాకు అమ్ముడవగా, కిలోకు రూ.248 సరాసరి ధర రైతులకు అభించింది. వారం, పది రోజుల్లో అధికారిక పొగాకు అమ్మకాలు పూర్తికానున్నాయి. అలాగే కందు కూరు-2లో 9.5 మిలియన్లకు అనుమతించగా ఇప్పటి వరకు 8.5 మిలియన్ల అమ్మకాలు పూర్తవగా కిలోకు రూ.243.92 సరాసరి ధర లభించింది. ఈ వేలం కేంద్రంలోనూ 14.5 మిలియన్ల పొగాకు ఉత్పత్తి అయినట్లు అంచనా. అంటే దాదాపు 5 మిలియ న్లు అదనంగా పండించారు. అలాగే కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాల పరిధిలోనూ 50శాతం వరకు అదనంగా పండించిన పొగాకు ఉన్నట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో

\- మిగతా 7లో..



కందుకూరులో వేలానికి ఉంచిన పొగాకు బేళ్లు

సీతారామపురం తహసీల్దార్ సస్పెన్షన్

సీతారామపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా సమస్యాత్మక భూమిని మ్యుటేషన్ చేశారన్న ఆరోపణలపై తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీతారామపురంలోని సర్వే నెం.68-5లో 0.81 సెంట్ల భూమికి సంబంధించి తోట నరసింహులు, ఈయన బంధువుల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి నిబంధనలకు విరుద్ధంగా ఒకవర్గం వారికి 0.40 సెంట్ల భూమిని మ్యుటేషన్ చేశారని ఆరోపిస్తూ మరోవర్గం వారు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో వాస్తవమని తేలింది. దీంతో తహసీల్దారును సస్పెండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నిధుల దుర్వినియోగంపై ఏటూరు సర్పంచుకు షోకాజ్ నోటీసు

చేజర్ల: పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు చేజర్ల మండలం ఏటూరు సర్పంచ్ వై.నాగభూషణమ్మకు డీపీవో శ్రీధర్ రెడ్డి షోకాజ్ నోటీసు అందజేశారు. వాస్తవానికి ఈ నెల 11వ తేదీన షోకాజ్ నోటీసు జారీ చేసినా మండల అధికారులు గోప్యంగా ఉంచారు. అనూహ్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఏటూరు పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ జూన్ 10వ తేదీన గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డివిజన్ పంచాయతీ అధికారి విచారించి తుది నివేదికను జూలై 28న డీపీవోకు అందజేశారు. రూ.44 వేలు దుర్వినియోగం చేయడంతో పాటు రూ.23,36,319 అభ్యంతకర రీతిలో ఖర్చు చేసినట్లు గుర్తించారు. వారం రోజుల్లోపు వివరణ ఇవ్వాలని సర్పంచుకు డీపీవో షోకాజ్ నోటీసు ఇచ్చారు.

పల్లెపాడులో 'పొలం పిలుస్తుంది'

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడులో మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీపై అన్నీ రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జీలగలు, జనుములు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మండలంలోని అన్నీ గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు జరుగుతున్నదని, పంట వేసిన ప్రతీ రైతు వారి పంట వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి సుధాకర్, సీహెచ్. వెంకటరమణయ్య, గిరి, సుబ్రహ్మణ్యం, గ్రామ రైతులు, వీఏఏ నరేష్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9463
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ. 117.20



వచ్చేనెల నుంచి కూలీలకు ముఖహాజరు

● ఏపీవో రాజమ్మ

మనుబోలు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల నుంచి ఉపాధిహామి పథకం కింద పనిచేసే కూలీలకు తప్పనిసరిగా ముఖహాజరు ఉండబోతుందని మండల ఏపీవో రాజమ్మ తెలిపారు.

? యుక్తధార యాప్ ఎలా అమలవుతోంది.

! ప్రస్థుతం చెరుకుమూడి పంచాయతీలో మాత్రమే ఈ యాప్ వాడుతున్నాం. అక్టోబర్, నవంబర్ నాటికి అన్ని పంచాయతీల్లో అధికారుల ఆదేశాలతో యాప్ ద్వారా పనులు గుర్తించి చేయడం జరుగుతుంది. ఈ యాప్ వలన పనిప్రదేశం కొలతలు ఖచ్చితంగా ఉంటాయి. డూప్లికేట్ చేసేందుకు వీలుండదు.

? ఎంతమంది కూలీలు పనులకు వస్తున్నారు.

! మండలంలోని 19 పంచాయతీల్లో వెయ్యి మంది కూలీలు పనులకు వస్తున్నారు. ప్రస్తుతం సాగునీటి కాలువ పనులు చేయిస్తున్నాం.

?. మినీగోకులాలు ఎంతవరకు అయ్యాయి?

! మండలానికి రెండు విడతలుగా మినీ గోకులాలు 47 మంజూరయ్యాయి. మొదటి విడతలో నిర్మించిన వాటికి బిల్లులు ఇచ్చేశాం. 37 వరకు పూర్తిచేశాం. మొదటి విడతలో రెండింటికి పెండింగ్ ఉన్నాయి. బిల్లులు రావాల్సి ఉంది.

? ఎన్ని ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు అవుతున్నాయి.

! మండలానికి 20ఎకరాలలో ఉద్యానపంటలు సాగుచేయించాలని లక్ష్యం ఇచ్చారు. ప్రస్తుతానికి 6.5ఎకరాలలో చేయిస్తున్నాం. దీనిపై ఆసక్తి కలిగిన రైతులు ముందుకు రావాలి.

చెరువు పోరంబోకులో శ్మశాన షెల్టర్

● నిబంధలను విరుద్ధంగా బిల్లుల మంజూరు ● పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న అధికారులు

● సమగ్ర విచారణ జరపాలి : టీడీపీ నేతలు

విడవలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చెరువు పోరంబోకు భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయినా నిబంధనలు తుంగలోతొక్కి. నిర్మించిన శ్మశాన షెల్టర్‌కి అధికారులు బిల్లులు మంజూరు చేయడం మండలంలో బుధవారం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో పంచాయతీ, పంచాయతీరాజ్ అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. విడవలూరు మండల పరిధిలోని గాదెలదిన్నె పంచాయతీ సర్వే నెంబరు 420లో చెరువు పోరంబోకు భూమి ఉంది. వైసీపీ హయాంలో ఆ భూమిలో శ్మశాన షెల్టర్‌ని నిర్మించారు. నిర్మాణ పనులు ప్రారంభించే సమయంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తహసీల్దారు, మండలాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా కూడా ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదీలీపై వెళ్లిన శ్రీనివాసులు తీర్మానాన్ని ఇచ్చాడు. దీంతో షెల్టర్ నిర్మాణ పనులు చకాచకా జరిగి పోయాయి.




చెరువు పోరంబోకు స్థలంలో నిర్మించిన శ్మశాన షెల్టరు

● నిబంధనలకు విరుద్ధగా బిల్లుల మంజూరు

చెరువు పోరంబోకు భూమిలో నిర్మాణాలు చేపట్టినా వాటికి నిబంధనల మేరకు బిల్లులు మంజూరు చేయకూడదు. షెల్టర్ నిర్మాణంపై ఫిర్యాదులు వెల్లువెత్తున్నా కూడా పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు బదిలీపై వెళుతూ ఎంబుక్ చేశారు. ఏడాదిన్నర క్రితం కట్టిన శ్మశాన షెల్టర్‌కి వారం క్రితం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3.27 లక్షలు పంచాయతీ అధికారులు మంజూరు చేశారు. ఈ వ్యవహారంలో పంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీవో లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముడుపులు తీసు కుని బిల్లులు మంజూరు చేశారని, వారిపై జిల్లాధికారులు సమగ్ర విచారణ జరపాలని స్థానిక టీడీపీ నాయకులు కోరుతున్నారు.

● బిల్లు పెట్టమంటే మంజూరు చేశా..

బిల్లుల మంజూరుపై పంచాయతీ కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ ఇదివరకే పంచాయతీ తీర్మాణం, ఎంబుక్ చేశారని, డిప్యూటీ ఎంపీడీవో మస్తాన్‌ఖాన్ బిల్లు పెట్టమంటే నేను మంజూరు చేశానని తెలిపారు. చెరువు పోరంబోకు భూమిలో షెల్టర్‌ని కట్టారని తనకు తెలియదని, అయి నా విచారించి బిల్లు లు మంజూరు చేయమన్నానని డిప్యూటీ ఎంపీడీవో మస్తాన్‌ఖాన్ చెప్పుకొచ్చారు. ఏదిఏమైనా ఒక పక్క తహసీల్దారుకు చెరువు పోరంబోకు భూమిలో షెల్టర్‌ని కట్టరాదని తెలిపినా కూడా, షెల్టర్‌ని నిర్మించి బిల్లులు మంజూరు చేయటంపై జిల్లా అధికా రులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి.



Name of contractor or agency by which executed 96

Rate	Per	Total Value to date	Deduct previous measurements		Since last Measurements		Re-marks
			Page	quantity	quantity	Value	

శ్మశాన షెల్టర్‌కు బిల్లులు మంజూరు చేసిన అధారపత్రం

ఎంబుక్ చేయకూడదు

చెరువు పోరంబోకు భూమిలో కట్టిన శ్మశాన షెల్టర్‌కి ఎంబుక్ చేయకూడదు. స్థానికులు కొందరు షెల్టర్‌కి ఎంబుక్ చేయమని అడిగితే నిరాకరించాను. అయినా ఏవిధంగా ఎంబుక్ చేశారో నాకు తెలియదు.

- శ్యామ్‌సుంధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ

మధ్యాహ్న భోజనానికి వితరణ

రాపూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థాని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనానికి రాపూరు టీడీపీ పట్టణ అధ్యక్షుడు వేదోటి కోటినాయుడు రూ.10వేలు విలువ చేసే వంట సరుకులు అందజేశారు. అదేవిధంగా రాపూరు పట్టణానికి చెందిన రాజేష్ నాలుగు బస్తాల బియ్యం, పూర్వ విద్యార్థి రేపూరు సుధాకర్ భోజనానికి అవసరమయ్యే ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ వి హనుమంతయ్య కృతజ్ఞతలు తెలిపారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ

వెంకటాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ ప్రవల్లిక విచ్చేసి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల చుట్టూ నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కొబ్బరిబోండాలు, నీరు నిల్వ ఉన్న పాత్రలు, ట్యాంకులు, తొట్టెలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు, వేపాకు పొగ, తదితరాలు వాడాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించాలంటే దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటాచలం హైస్కూల్ హెచ్‌ఎం లతా, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకుపల్లిలో మెగా వైద్య శిబిరం

పొదలకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి : మండలంలోని అంకుపల్లి గ్రామంలో బుధవారం ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, మెడికోవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటుచేశారు. గ్రామ ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు, మెడికవర్ హాస్పిటల్, గుండె, ఊపిరితిత్తులు సంబంధిత వాటిపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విద్యార్థి సంఘం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకా ప్రసాద్, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ హనీబ్, సిబ్బంది, మెడికోవర్ హాస్పిటల్ సిబ్బంది, అంకుపల్లి గ్రామస్థులు కొప్పల బాలకృష్ణ, కొప్పాల వేమయ్య, ఏవీఎస్ నాయకుడు బొడ్డు ప్రవీణ్, గుడపాటి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కసుమూరు దర్గా హుండీ లెక్కింపు



డబ్బులు లెక్కిస్తున్న వక్ఫ్‌బోర్డు సిబ్బంది

వెంకటాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్ వలి దర్గా హుండీ లెక్కింపు బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైంది. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖ సమక్షంలో గ్రామస్థులు, దర్గా ముజావర్ల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు ప్రారంభం కాగా మొత్తం 15 హుండీలను లెక్కించనున్నట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు. ఈలెక్కింపు ప్రక్రియ రెండురోజులపాటు కొనసాగే అవకాశం ఉందని దర్గా ఈవో షేక్ షరీఫ్ తెలిపారు. వక్ఫ్‌బోర్డు అధికారి మొహ్మద్ హుస్సేన్, జిల్లా ఇన్స్పెక్టర్ ఖుదావన్, దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ షరీఫ్, దర్గా కేర్ టేకర్ పఠాన్ అస్లాం ఖాన్ దగ్గరుండి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. కాగా గతంలో అనేకసార్లు జరిగిన దర్గా హుండీ లెక్కింపు సమయాల్లో కొందరు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణాలున్నాయని, హుండీ లెక్కింపు ప్రక్రియను పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు వెల్లడించారు.

నావూరులో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు




శ్రీకృష్ణుడి ఊరేగింపులో భక్తులు

పొదలకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో మండ లంలోని నావూరు గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల ముగిం పులో భాగంగా బుధవారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింప వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాం తం ప్రబోధ సమితి ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు జి పెంచలనరసయ్య, బి కృష్ణయ్య, ఎం కొండయ్య, టి నరసారెడ్డి, టి కల్పన, టి భాగ్యమ్మ, ఎంపెంచలస్వామి, సీహెచ్ పద్మమ్మ, పి.మధు, తదితరులు పాల్గొన్నారు.

'గండికోట'కు మానవతామూర్తి పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు20 (ఆంధ్ర జ్యోతి): నగర పంచాయతీ పరిధి రామచంద్రాపురం ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కు మానవతామూర్తి పురస్కారం లభించింది. దీంతో బుధవారం ఎంఈవోలు ధిలీప్‌కుమార్, వీవీ.రత్నం అభినందించారు. నెల్లూరు పురమందిరంలో మంగళవారం రాత్రి సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మానవతాది నోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు గండికోటకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా గండికోటను బంధువులు, మిత్రులు అభినందించారు.

పౌష్టికాహారం పంపిణీలో అవకతవకలపై తోకంచి అంగన్‌వాడీ టీచర్‌పై విచారణ



అంగన్‌వాడీ పౌష్టికాహార లబ్ధిదారులను విచారిస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

పొదలకూరు: పౌష్టికాహారం పంపిణీలో అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరనగర్ (తోకంచి) అంగ న్‌వాడీ కార్యకర్త సునీతపై ఐసీడీఎస్ అధికా రులు బుధవారం విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ సరుకులను సక్రమంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించకుండా ఆ సరు కులను ఆటోలో పక్కదారి పట్టించే ప్రయత్నం లో మంగళవారం స్థానికులు అడ్డుకొని ఉన్నత అధికారులకు తెలియజేశారు. దీనిపై వెంకటా చలం ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మీ గ్రామ స్థుల సమక్షంలో విచారణ చేపట్టారు. కొందరు మాట్లాడుతూ తమకు సక్రమంగా సరుకులు అందించలేదని, పాఠశాలల్లో ఉండాల్సిన ఫర్నిచర్ కూడా లేదని, కొంత సరుకులు బడి వెనుక దాచినట్లు ఆమెకు వివరించారు. ఈసందర్భంగా సీడీపీవో విజయలక్ష్మీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని పౌష్టికాహారంలో కొంత భాగం పాలు, గుడ్లు, రాగిపిండి, చిక్కీలు ఆటోలో తరలిస్తుండగా పట్టుకుని, స్థానికులు తమకు ఫిర్యాదు చేశార న్నారు. విచారణలో భాగంగా స్టాక్ వివరాలు, పంపిణీ వివరాలు అన్నీ సేకరించామని, తుది నివేదికను ఉన్నత అధికారులకు అందిస్తామని, ఆ నివేదిక ఆధారంగా అంగన్‌వాడీ కార్యకర్త సునీతపై చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, ఆదిలక్ష్మీ, టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే శిక్ష అనుభవించాల్సిందే

● జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి



మాట్లాడుతున్న బొబ్బేపల్లి సురేష్ నాయుడు

వెంకటాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందేనంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఉద్దేశించి సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు విమర్శించారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని మాజీ మంత్రి కాకాణి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో అడ్డుఅదుపులేకుండా అవినీతి, అక్రమాలు, దోపిడీ, భూకబ్జాలకు పాల్పడితేనే కేసులు నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, నేతలు సందూరి శ్రీహరి, పొట్లూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే మలేరియాకు అడ్డుకట్ట



రాపూరులో జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

రాపూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపూరులో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాపూరు మండలం సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వేపినాపి పీహెచ్‌సీ డాక్టర్ ప్రమీల రాజకుమారి, సూర్య, ధర్మేంద్ర, భాను, సుదర్శనమ్మ, వైద్య అధికారులు, సూపర్‌వైజర్‌లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశాలు పాల్గొన్నారు.

అళగనాథస్వామి ఆలయ చైర్మన్‌గా సుదీప్‌రెడ్డి

విడవలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లిలో వెలసి ఉన్న శ్రీకామాక్షిదేవి సమేత శ్రీ అళగనాథస్వామి ఆలయ చైర్మన్‌గా, గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకుడు ఉచ్చూరు సుదీప్‌రెడ్డిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సుదీప్‌రెడ్డి మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి చొరవతో తనకు దేవుడి సేవ చేసుకొనే భాగ్యం కలిగిందన్నారు. దేవస్థాన అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అయన తెలిపారు.



ఉచ్చూరు సుదీప్‌రెడ్డి

'అక్షర ఆంధ్ర'పై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి) : అక్షర ఆంధ్రపై సచివాలయ సిబ్బందికి బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నారాయణరెడ్డి మాట్లాడుతూ సాయంత్రం 4నుంచి రాత్రి 7గంటల వరకు అక్షరాస్యత కేంద్రాలు నిర్వహించాలన్నారు. ప్రతి పదిమంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ని ఏర్పాటుచేసినట్టు తెలిపారు. చదవడం, రాయడంతోపాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. వందరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో నిరక్షరాస్యులను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. శిక్షకులుగా హాజరైన గండికోట సుధీర్‌కుమార్ అక్షర ఆంధ్ర కార్యక్రమం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దిలీప్‌కుమార్, సచివాలయ సిబ్బంది, కమ్యూనిటీ మొబిలైజర్లు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

డ్రోన్‌తో చిత్రీకరించిన నిందితుల అరెస్ట్

● మాజీ ఎమ్మెల్యేతోపాటు నలుగురిపై కేసు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీధర్

కావలి రూరల్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డిపై హత్యాయత్నం చేసేందుకు క్రషర్స్ వద్ద డ్రోన్‌తో చిత్రీకరించిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి, వారిలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి డీఎస్పీ శ్రీధర్ మీడియాకు ముద్దాయిల వివరాలు వెల్లడించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి జలదంకి మండలం అన్నవరంలోని గురురాఘవేంద్ర క్రషర్స్ వద్దకు రాగానే, దాడి చేసేందుకు ఏ5 ముద్దాయి అయిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో ఎమ్మెల్యే కదలికలపై రెక్కీ నిర్వహించారు. అక్కడకు ఎమ్మెల్యే వస్తారని ఆయన రాకను గమనించాలని డ్రోన్‌తో చిత్రీకరిస్తున్న ఏ1 ముద్దాయి ఇస్సారపు వేణు, ఏ2 గోళ్ల వినోద్‌కుమార్, ఏ3 దామెర్ల శ్రావణ్‌కుమార్, ఏ4 ఆత్మకూరి రాజేష్‌లను అక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్ సొంగా ఏడుకొండలు, సిబ్బంది పసిగట్టి మీరెవరని అడ్డుకోబోగా వారిపై కూడా రాళ్ళు, కత్తులతో దాడిచేసి చంపే ప్రయత్నం చేశారన్నారు. అక్కడ పని చేసేవారంతా రావటంతో నలుగురు అక్కడ నుంచి పరారైనట్లు తెలిపారు. సూపర్‌వైజర్ ఏడుకొండలు ఫిర్యాదుతో జలదంకి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జలదంకి మండలం జమ్మలపాలెం వద్ద వేణు, వినోద్ కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. మిగిలిన ముద్దాయిలను పట్టుకునేందుకు స్పెషల్ టీంలు ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. కలిగిరి ఎస్ఐ ఉమాశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఉదయగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై కారు బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు.. సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు పని నిమిత్తం కారులో నెల్లూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈనేపథ్యంలో దాసరిపల్లి గ్రామ సమీపానికి రాగానే ఒక్కసారిగా అటవీ ప్రాంతం నుంచి పందులు రోడ్డుపైకి రావడంతో వాటిని ఢీకొని కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు కాగా, కారు దెబ్బతింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మినీ వ్యాన్ ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్ నుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయుడిని మినీ వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు. ఏపీ ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్య ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నరేష్ సెంటర్ నుంచి పాఠశాలకు వెళుతున్నాడు. ఈతరుణంలో కావలి నుంచి మైదుకూరుకు వెళుతున్న మినీ వ్యాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా మలుపు తిప్పడంతో ప్రమాదవశాత్తు ఉపాధ్యాయుడి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంపై ఎస్ఐ ఆదిలక్ష్మీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో దంపతుల దుర్మరణం

● స్వల్పగాయాలతో బయటపడ్డ ఇద్దరు పిల్లలు

● కల్వర్టును ఢీకొట్టిన బొలెరో కారు

● బాధితులు మనుబోలు వాసులు



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జైన బొలెరో కారు

లింగాలఘణపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల వద్ద జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దద్దోలు సురేశ్(36), దివ్య (30) దుర్మరణం పాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మునుబోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన సురేశ్ అతడి భార్య దివ్య, పిల్లలు మోక్షజ్ఞ్, లోక్షణతో కలిసి కరీంనగర్‌లో నివాసముంటూ ఓ గ్రానైట్ ఇండస్ట్రీలో గ్రానైట్ మార్కర్‌గా పనిచేస్తున్నారు. కాగా స్వస్థలం వడ్లమూడి నుంచి కరీంనగర్‌కు తెల్లవారుజామున కారులో భార్యాపిల్లలతో కలిసి బయలుదేరారు. ఈ క్రమంలో జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై అతివేగంగా వచ్చిన కారు సురేశ్ నిద్రమత్తు కారణంగా అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా డ్రైవింగ్ చేస్తున్న సురేశ్‌తో పాటుగా అతని వెనుక సీటులో కూర్చున్న భార్య దివ్య తీవ్రగాయాలపాలై కారులో ఇరుక్కుపోయారు. వెంటనే సమాచారం అందుకున్న లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానికుల సాయంతో కారులో నుంచి బయటకు తీసి 108 ద్వారా జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా సురేశ్ మార్గమధ్యలోనే మృతి చెందగా అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న దివ్య ఆసుపత్రిలో మృతిచెందింది. ఇద్దరు పిల్లలు మోక్షజ్ఞ్, లోక్షణ స్వల్పగాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇద్దరి మృతదేహాలను జిల్లా ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచినట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు.





మృతిచెందిన సురేశ్, దివ్య

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 525



భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వర ఆలయం, రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం సాయంత్రం ప్రదోషకాల అభిషేకాలు, పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్వామివారికి, నందీశ్వరుడికి ఏక కాలంలో అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం మూలస్థానేశ్వర ఆలయంలో చిన్న వెండి నంది వాహనంపై శివ పార్వతులకు ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. ఈవో అర్వ భూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అలంకారం, పూజలు జరిగాయి. సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



ఆలయాలకు పాలక మండళ్లు

● మల్లేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా రమణయ్య
● జంట ఆలయాలకు శ్రీనివాస్

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆలయాల పాలక మండళ్ల నియామకం ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. ఇటీవల ప్రభుత్వం పలు ఆలయాల ధర్మకర్తల కమిటీల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయడంతో పాలక మండళ్ల కొలువుదీరుతున్నాయి. ఈ క్రమంలో నగరంలోని పురాతన ఆలయమైన నవాబుపేట మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్ పేటలోని జంట ఆలయాలైన కోదండ రామస్వామి, కాశీ విశ్వనాథ స్వామి ఆలయాల పాలక మండళ్ల ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. మల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల కమిటీ చైర్మన్‌గా కే వెంకట రమణయ్య ఎంపికయ్యారు. సభ్యులుగా వై నాగేశ్వరమ్మ, టీ శ్రీనివాసులురెడ్డి, వై మాధవ రావు, డీ శివపార్వతి, పీ రాణమ్మ, ఎం సాయికిరణ్‌కుమార్, ఎస్ సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణ విద్యా సంస్థల జీఎం, టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జున రెడ్డి హాజరై సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. వారితో ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ నిర్ణయం మేరకు పురాతన మల్లేశ్వర ఆలయాన్ని రూ.5.50 కోట్లతో పునర్నిర్మించనున్నట్లు చెప్పారు. నూతన కమిటీ సభ్యులు దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మల్లేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు

● జంట ఆలయాలకు చైర్మన్‌గా శ్రీనివాస్

నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఉన్న కోదండరామస్వామి, కాశీ విశ్వనాథ స్వామి ఆలయాల పాలక మండలి చైర్మన్‌గా బొక్క వెంకట శ్రీనివాస్ ఎంపికయ్యారు. కలతూరు రమేష్‌బాబు, మన్నెం సునీత, దోర్నాల లలిత, వేంపల్లి సుమంత్‌కుమార్, గుజ్జల శ్రీవాణి, దాసరి రాజేశ్వరి, బత్రి నాగేంద్ర, బీమవరపు రాధయ్యను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, ఆలయ ఈవో దర్గయ్య హాజరై సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. వారితో ప్రమాణస్వీకారం చేయించారు.


జంట ఆలయాల పాలక మండలి ప్రమాణ స్వీకారం



ఇంటర్వ్యూ...

అంగన్‌వాడీలకు కొత్త సెల్‌ఫోన్లు

● నెల్లూరు అర్బన్ సీడీపీవో అరుణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలకు త్వరలో కొత్త స్మార్ట్‌ఫోన్లు ఇవ్వనున్నట్లు ఐసీడీఎస్ నెల్లూరు అర్బన్ సీడీపీవో టీ అరుణ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న సేవల వివరాలు ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం తాము వినియోగిస్తున్న సెల్‌ఫోన్లు యాప్‌లకు సహకరించటం లేదంటూ ఇటీవల సిబ్బంది వారి ఫోన్లను మూట కట్టి సీడీపీవో కార్యాలయాల్లో పెట్టేసి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రశ్నలకు సీడీపీవో సమాధానమిచ్చారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

? అంగన్‌వాడీ వర్కర్లకు కొత్త సెల్‌ఫోన్లు ఎప్పుడిస్తారు.
! ప్రభుత్వం త్వరలో ఫోన్లు అందచేయనుంది.
? అర్బన్ సెక్టార్ పరిధిలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో ఎంత మంది చదువుతున్నారు.
! 355 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఐదు వేల మంది పిల్లలు చదువుతున్నారు.
? గర్భవతులు, బాలింతలకు పోషకాహార కిట్లు ఇస్తున్నారా..
! బాల సంజీవని కిట్లు నెలకొకటి చొప్పున అందజేస్తున్నాం.
? చిన్నారులకు ఏఏ కిట్లు ఇస్తున్నారు.
! ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు వయసున్న పిల్లలకు బాలామృతంతోపాటు, కోడి గుడ్లు, పాలు అందచేస్తున్నాం.
? సెల్‌ఫోన్లు లేని ప్రస్తుత పరిస్థితుల్లో పోషకాహర కిట్లు ఎలా అందచేస్తున్నారు.
! అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యాప్‌లో వాటిని నమోదు చేసి అందచేస్తున్నాం. కొన్ని చోట్ల రికార్డులలో నమోదు చేసి అందచేస్తున్నాం.

న్యూస్ బాక్స్

నావిక్‌కు కొత్త సిగ్నల్

● వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టిలేషన్(నావిక్) సిస్టంలో ప్రజలు వేగంగా వినియోగించు కునేందుకు ఎల్-1 ఫ్రీక్వెన్సీతో కొత్త సిగ్నల్ ప్రవేశపెడుతున్నామని పబ్లిక్ ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వశాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం పార్లమెంటు లో నావిక్‌పై అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ 60కిపైగా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు నావిక్‌కు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. అంతరిక్ష శాఖ వివిధ రంగాలలో నావిక్ వినియోగాన్ని విస్తృతం చేయడంపై నిమగ్నమై ఉందని తెలిపారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

● 24 నుంచి నిర్వహణ

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో "అమరావతి చాంపియన్‌షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29వ తేదీన విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తారని స్పష్టం చేశారు.

బార్లకు ఎన్ని దరఖాస్తులైనా..

కావలి,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): బార్‌లకు ఓ వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని కావలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నూతన బార్ పాలసీ గురించి వివరించారు.

గణేష్ నిమజ్జనకు పటిష్ట ఏర్పాట్లు

● సన్నాహక సమన్వయ సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : నగరంలోని నెల్లూరు చెరువు గణేష్ ఘాట్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనకు పక్కా ప్రణాళికతో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నందన్, ఆర్డీవో అనూషతో కలిసి గణేష్ నిమజ్జన సన్నాహక సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ గతేడాది లోపాలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 27వ తేదీన వినాయక చవితిరోజు, ఆపై మూడవ, ఐదవ రోజు నిమజ్జనాలకు చర్యలు చేపట్టామన్నారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల భక్తులే కాకుండా కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలకు చెందిన గణేష్ కమిటీలు కూడా నిమజ్జనోత్సవాల్లో పాల్గొనవచ్చని పిలుపునిచ్చారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని అందరి సమన్వయం తో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ నాయకులు సురేంద్రరెడ్డి, బయ్యా శ్రీనివాస్, కొండపల్లి శ్రీనివాస్, సత్యనాగేశ్వరరావు, వేలూరు మహేష్, ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ నందన్, ఆర్డీవో అనూష

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి నాగేంద్రసాయి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ట్రాఫిక్ సమస్యకు అధికారులు తక్షణం పరిష్కారం చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి డిమాండ్ చేశారు. ఈ నెల 23 నుంచి ఒంగోలులో జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల తో మాట్లాడారు. జిల్లాలో గంజాయి విక్రయాలను అరికట్టాలని, సర్వేపల్లి నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలని కోరారు. మహిళలపై అత్యాచారాలను అరికట్టేందుకు తీసుకువచ్చిన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీని గ్రామస్థాయిలో పటిష్టం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాల కొండయ్య, వినోదమ్మ, మస్తాన్, మున్న, శంకర్ కిశోర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగేంద్రసాయి



సీఎంను కలిసిన 'పెళ్లకూరు'

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి బుధవారం అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ బజారుతో పేదలకు జీవనోపాధి

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబాలకు చెందిన వీధి వ్యాపారుల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు స్మార్టు స్ట్రీట్ బజారును ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ నందన్ తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా, ఇతర సమన్వయ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నెల్లూరులోనే స్మార్టు స్ట్రీట్ బజారును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రయోగాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టు సఫలీకృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక శాఖ ద్వారా మంత్రి నారాయణ మరిన్ని బజార్లు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ బజారులో దుకాణాల నిర్వహణ విషయమై వ్యాపారులు కార్పొరేషన్ నియమనిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో కనకాద్రి, కార్యదర్శి శ్రీలక్ష్మి, మెప్మా కార్యాలయం ఏవో సుధాకర్ పాల్గొన్నారు. కాగా, నగరంలోని పలు అన్న క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. అక్కడ మెరుగైన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.


స్మార్ట్ బజారుపై సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ నందన్

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, దోమ కాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహించారు. దోమ కాటుతో మలేరి యా వ్యాధి వస్తుందని వెల్లడించిన శాస్త్ర వేత్త రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఇళ్లలో నీరు నిల్వ ఉంచొద్దని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు అవగాహన కలిగిస్తున్నామని హుస్సేనమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


శాస్త్రవేత్త రాస్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

మాపై దాడిచేశారు.. న్యాయం చేయండి!

● జీజీహెచ్ అభివృద్ధి కమిటీకి స్టాఫ్‌నర్సుల వినతి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మేల్ స్టాఫ్ నర్సుపై జూనియర్ వైద్యులు దాడి చేశారని, న్యాయం చేయాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మడపర్తి శ్రీనివాసులుకు నర్సులు వినతి పత్రం అందించారు. స్టాఫ్‌నర్సులు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ సాయంత్రం మేల్ స్టాఫ్ నర్సు వెంకటయ్యపై జూనియర్ డాక్టర్లు దాడి చేశారన్నారు. అడ్డుపోయిన హెడ్ నర్సు శాంతిని దుర్భాషలాడారని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దారి మల్లికార్జున, స్టాఫ్‌నర్సులు సత్యవతి, రూతు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భగవద్గీత జ్ఞాన పరీక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం డైకస్‌రోడ్డు సెంటర్‌లో పాఠశాల విద్యార్థుల కు భగవద్గీత జ్ఞాన పరీక్షలు జరిగాయి. 140 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు గురువారం బహుమతి ప్రదానం జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ తెలిపాయి.

రంగడి ఆలయంలో రేపు సామూహిక కుంకుమార్చన

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా 22వతేదీ ఉదయం 9.30 గంటలకు సామూహిక కుంకుమార్చన జరుగుతుందని ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, రాత్రి చంద్రప్రభ వాహన సేవ, పేట ఉత్సవం జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

ఐటీఐ అడ్మిషన్లకు ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఆగసు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మూడో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు అనంతరం కేటాయించే ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగిన రిజిస్టర్ కాపీని ప్రింట్ తీసుకుని భద్ర పరచుకోవాలని సూచించారు. ఈనెల 27లోపు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలని, లేకుంటే దరఖాస్తును పరిగణలోకి తీసుకోరని పేర్కొన్నారు. ప్రభుత్వ ఐటీఐకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 29వతేదీన, ప్రైవేట్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 30వతేదీన కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. సందేహాలుంటే సమీపంలోని ఐటీఐలలో సంప్రదించాలని సూచించారు.

పార్కుకు ప్రహరీ నిర్మాణం

నెల్లూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 30వ డివిజన్ పోలీసు కాలనీలో రూ.40 లక్షలతో చేపట్టిన పార్కు ప్రహరీ నిర్మాణాన్ని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. పార్కులు, ఇతర ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గోడలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రామలింగాపురం వంతెన వద్ద జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణపనులను పరిశీలించారు.

యూరియా ఎక్కువ వాడొద్దు

● డీఏవో సత్యవాణి

నెల్లూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : వరి సాగులో రైతులు యూరియాను మితిమీరి వాడొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్య వాణి సూచించారు. బుధవారం మండలంలోని పెనుబర్తి గ్రామంలో ఆమె రైతులతో మాట్లాడారు. ప్రస్తుత ఎడగారులో వరి సాగుచేసే రైతులు యూరియాను మితంగానే ఉపయోగించాలని తెలిపారు. మితిమీరిన వాడకంతో కాలుష్యం, దిగుబడిపై ప్రభావం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ మురళి, ఏడీ శ్రీదేవి, ఏవో నాగమోహన్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను శాస్త్రీయత వైపు మళ్లించాలి


● శాస్త్రీయ దృక్పథ దినోత్సవంలో జేవీవీ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను మూఢనమ్మకాల నుంచి శాస్త్రీయత వైపు మళ్లించాలని, ఇందుకు కృషి చేస్తున్నామని జన విజ్ఞాన వేదిక నాయకులు తెలిపారు. నగరంలోని డాక్టర్ బాల కోటేశ్వరరావు ఆసుపత్రిలో బుధవారం సాయంత్రం జేవీవీ ఆధ్వర్యంలో జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవం, డాక్టర్ నరేంద్ర దబాల్కర్ వర్ధంతి జరిగాయి. జేవీవీ జిల్లా అధ్యక్షుడు గౌస్‌బాషా మాట్లాడుతూ దేశంలో మూఢనమ్మకాలను నిరోధిస్తూ చట్టం తేవాలని పోరాటం చేస్తున్న డాక్టర్ నరేంద్ర దబాల్కర్‌ను మతోన్మాదులు 2013 ఆగస్టు 20న కాల్చి చంపారని తెలిపారు. ఆయన త్యాగానికి గుర్తుగా ఏటా జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీ బాలకోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఎండీ రఫీ, డాక్టర్ ఓబులేసు, డాక్టర్ వీ వేణుగోపాల్, చక్రపాణి, ప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో జేవీవీ నాయకులు, వైద్యులు

మహిళలకు చీరల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పుట్టినరోజును బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. టీమ్ జీకే ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులో మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. సేవా బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. కిషోర్ మాట్లాడుతూ పార్టీ ఉన్నతికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యద ర్శి సుందరరామిరెడ్డి, జిల్లా ఆఫీస్ ఇన్‌చార్జి జమీర్, నాయకులు కృష్ణారెడ్డి, రవికుమార్, మార్కెట్ సురేష్, సుధా మాధవ్ తదతరులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న గునుకుల కిషోర్

'జగన్' రీసర్వే తప్పిదాలపై పోరాటం


● రైతు సంఘం మండల మహాసభలో తీర్మానం

నెల్లూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : జగన్ ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీ సర్వే ప్రక్రియ వల్ల అనేక మంది రైతులకు అన్యాయం జరిగిందని, దీనిపై సుదీర్ఘ పోరాటాలు నిర్వహించాలని ఏపీ రైతు సంఘం నెల్లూరు రూరల్ మండల మహాసభలో తీర్మానించారు. బుధవారం సౌత్ మోపూరులోని సీపీఎం కార్యాలయంలో మహాసభ నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు శ్రీరాములు, వెంగయ్య, కౌలు రైతు సంఘం నేత చంద్రమౌళి పాల్గొన్నారు. మండల అధ్యక్షకార్యదర్శులుగా అబ్దుల్లా, పూడిపర్తి జనార్దన్, మరో 11 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. జనార్దన్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో చేపట్టిన రీసర్వే రైతాంగానికి అనర్థంగా మారిందని విమర్శించారు. లోతట్టు ప్రాంతాల రైతులకు మట్టిని ఉచితంగా అందచేయాలని, స్మార్టు మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, రైతులకు యూరియా కష్టాలు తీర్చాలని మహాసభలో తీర్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకుడు ఆలూరు తిరుపాలు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న రైతు సంఘాల నాయకులు

కార్మిక చట్టాలు అమలు చేయాలి : సీఐటీయూ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాడుతామని ప్రకటించారు. స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారికి వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం 46 మందితో నూతన కమిటీని, 13 మంది ఆఫీసు బేరర్లు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, నాగేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

త్వరలో ముగియనున్న పొగాకు కొనుగోళ్లు!

(5వ పేజీ తరువాయి)

మొత్తం పొగాకు అమ్మకాలు పూర్తవ్వాలంటే ఈ ఏడాది నవంబరు వరకు వేలం కేంద్రాలు నిర్వహించాల్సి రావచ్చని, అయితే నేటికీ అనధికారిక పొగాకు కొనుగోళ్లకు బోర్డు, కేంద్ర వాణిజ్యశాఖల నుంచి అనుమతులు రాకపోవడం ఆందోళన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు.

● అపరాధ రుసుముపైనా సస్పెన్స్

అనధికారిక పొగాకు విక్రయాలపై గతంలో ఉన్న అపరాధ రుసుమును కేంద్ర వాణిజ్య శాఖ రద్దు చేయడం రైతులకు ఊరటనిచ్చింది. బోర్డు అనుమతికి మించి పండించిన పొగాకు అమ్ముకోవాలంటే రైతులు క్వింటాకు రూ.200, మొత్తం విలువలో 5 నుంచి 15 శాతం వరకు బోర్డుకు అపరాధ రుసుము చెల్లించే విధానం గతంలో అమలులో ఉండేది. గత రెండేళ్ల అపరాధ రుసుము పూర్తిగా మినహాయింపు ఇవ్వటంతో రైతులకు లక్షలాది రూపాయలు లబ్ధి చేకూరింది. ఈ తరుణంలో ఈ ఏడాది అనధికారిక పొగాకు దిగుబడి అధికంగా ఉన్నందున అపరాధ రుసుము చెల్లించాలంటే ప్రతి రైతుకు వేలాదిరూపాయలు అదనపు భారం పడే అవకాశం ఉంది. ఈ స్థితిలో ఈ ఏడాది కూడా అపరాధ రుసుము మినహాయింపు ఇస్తూ అనధికారిక పొగాకు కొనుగోళ్లకు తక్షణం అనుమతులు వచ్చేలా చూడటం ద్వారా వేలం కేంద్రాలు నిలిచిపోకుండా వేలం ప్రక్రియ జరిగేలా చూడాలని రైతులు కోరుకుంటున్నారు.

● ధరలో కదలిక.. చిగురిస్తున్న ఆశలు

పొగాకు వేలం కేంద్రాల్లో అధికారిక పొగాకు విక్రయాలు పూర్తయ్యేదశలో ధరల్లో కదలిక ప్రారంభం కావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొన్ని నెలలుగా అత్యధిక ధరపై కిలోకు రూ.280 వద్ద సీలింగ్ పెట్టి కొనుగోళ్ల చేస్తూ వచ్చిన వ్యాపారులు 2, 3 రోజులుగా సీలింగ్ పరిధి దాటి నాణ్యమైన పొగాకు బేళ్లకు రూ.281 ధర వేస్తుండటం విశేషం. అలాగే లో గ్రేడ్‌లు, మీడియం గ్రేడ్‌ల పొగాకుకు కూడా క్వింటాకు రూ.వెయ్యి వరకు ధరపెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. సీలింగ్ పరిధి దాటి ధర పెట్టినందున రానున్న రోజుల్లో ధర పెరిగే అవకాశాలు లేకపోలేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆశతో రైతులు ప్రస్తుతం నాణ్యమైన పొగాకును వేలంకు పెట్టకుండా లో గ్రేడ్‌లు, మీడియం గ్రేడ్‌లనే అధికంగా తెస్తున్నారని హైగ్రేడ్ పొగాకు బేళ్లను కోల్డ్‌స్టోరేజీల నుంచి బయటకు తీస్తే ధర మరికొంత పెరిగే అవకాశం లేకపోలేదని బోర్డు అధికారులు సైతం అభిప్రాయపడుతున్నారు. అనుమతుల కోసం వేలం కేంద్రాలను నిలిపివేయాల్సిన పరిస్థితి రాకుండా అధికారిక పొగాకు విక్రయాలు పూర్తయ్యేలోపే అనధికారిక పొగాకు విక్రయాలపై మార్గదర్శకాలు వస్తే రైతుకు మేలు జరుగుతుందని ఆ దిశగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పింఛనుకు అనర్హత.. నోటీసులతో కలత

పింఛన్ పునఃపరిశీలన ప్రక్రియపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. పింఛన్‌కు అన్ని అర్హతలు ఉన్నవారిని కూడా అనర్హులుగా తేల్చి నోటీసులు జారీ చేయడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు అందుకున్న లబ్ధిదారులు సచివాలయం, ఎంపీడీవో కార్యాలయం, వైద్యశాలల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. బుధవారం మండలంలో నోటీసులు అందుకున్న పలువురు లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని అక్కడి అధికారులకు తమ గోడు వినిపించారు. నోటీసు అందుకున్న వారు అప్పీలు చేసుకుంటే మరలా వైద్యాధికారి పరిశీలించి మీ అర్హతను బట్టి సదరం సర్టిఫికెట్ మంజూరు చేస్తారని, మరలా పింఛన్ పొందవచ్చని అధికారులు తెలుపుతున్నారు. దివ్యాంగులమైన తమను ఈవిధంగా బాధపెట్టడం తగదని మదనపడుతూ ఊసూరుమంటూ వెనుతిరుగుతున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



హనుమంతుడిపై కలువుదీరిన వెంకయ్యస్వామి రథం ముందు భక్తులు



వెంకయ్యస్వామికి హనుమంతసేవ

వెంకటాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గొలగమూడి వెంకయ్య స్వామి 43వ ఆరాధనోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. 3వ రోజు బుధవారం ఉదయం స్వామివారు హనుమంతుడిపై విహరించారు. రాత్రికి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గొలగమూడి గ్రామ వీధుల్లో వేసిన చలువ పందిళ్ల కింద వెంకయ్య రాక కోసం మహిళలు తమ ఇళ్ల ముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. స్వామికి కర్పూర నీరాజనాలు అందించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా, గురువారం దుయం చిన శేషవాహనం, రాత్రి గజవాహన సేవలు జరుగుతాయని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడి



మండలంలోని వంగల్లు జెండా వీధిలో చిన్నపాటి వర్షానికే సిమెంట్ రోడ్డు మీద నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది. సిమెంట్ రోడ్డు వేసి డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో దోమలకు నిలయంగా మారింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ చేరకుండా డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

'సాధారణ' భక్తులకు టికెట్!

- రూ.100 ఇవ్వాలని కోన సిబ్బంది ఒత్తిడి
- భక్తులు తిరగబడటంతో జారుకున్న వైనం

రాపూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో అధికారుల వ్యక్తిగత నిర్ణయాలు భక్తులు తీవ్ర ఆగ్రహావేశాలకు గురి చేస్తోంది. ఎక్కడా లేని విధంగా క్షేత్రంలోని ఓ ఉన్నతాధికారి కొత్త నిబంధనలు అమలు చేస్తుండటంతో ఆలయ ఉద్యోగులు, అర్చకులకు ఇబ్బందులు తప్పడంలేదు. సాధారణంగా స్వామివారి దర్శనానికి ఉచితం, శీఘ్రదర్శనం కోసం రూ.100 టికెట్టు తీసుకోవాలి. ఇది భక్తుల ఇష్టం. అయితే, క్యూలైన్‌లో లక్ష్మీనృసింహుడి దర్శనం కోసం వేచి ఉన్న భక్తుల వద్దకు దేవస్థానం సిబ్బంది వెళ్లి రూ.100 లెక్కన చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. దీనిపై కొంతమంది భక్తులు తిరగబడి తాము టికెట్ ఎందుకు తీసుకోవాలని గట్టిగా నిలదీయడంతో సిబ్బంది అక్కడ నుంచి జారుకున్నారు. ఇదంతా తమ మొబైళ్ల ద్వారా వీడియో తీసిన భక్తులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

విమర్శల వెల్లువ

ఆలయ ఉన్నతాధికారిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ఆ అధికారిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారంలో ఒక్కరోజు మాత్రమే కోనకు చుట్టపుచూపుగా వస్తుంటారనే విమర్శలు ఉన్నాయి. అలాగే దేవస్థానానికి విరాళాలు, వీఐపీలు వస్తే వారికి అంతరాలయ దర్శనం కల్పించడం ఆనవాయితీ. అయితే, దానిని పూర్తిగా విస్మరించారన్న అపవాదు ఉంది. అలాగే కోనలోని అంగళ్లలో టెంకాయ, కాయ కర్పూరం అధిక ధరలకు అమ్ముతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దేవస్థానంలో జరిగే కొన్ని పనులు టెండర్లు పిలవకనే నామినేటెడ్ పద్ధతిలో తనకు కావాల్సిన వారికి కట్టబెట్టారనే గుసగుసలు వినవస్తున్నాయి. అంతేగాక ఎన్నడూ లేని విధంగా మీడియాకు సైతం ఆ అధికారి ఆంక్షలు విధించారు.

వారికి నోటీసులిచ్చాం

కొంతమంది భక్తులు రూ.100 టికెట్ తీసుకోకుండా క్యూలైన్‌లో వచ్చారు. వారిని మాత్రమే ఆలయ సిబ్బంది టికెట్ అడిగారు. ఇది మూడు రోజుల క్రితం జరిగిన సంఘటన. ఇలా చేయడం కూడా ఆలయ సిబ్బంది తప్పిదమే. ఆ సిబ్బందికి నోటీసులు జారీ చేశాం.

- పి.శ్రీనివాసులురెడ్డి, పెంచలకోన ఈవో

రం'డబ్బా'.. ఎరువులొచ్చేశాయ్!

- మార్కెట్లోకి నానో ఎరువులు
- ఖర్చు తక్కువ.. పర్యావరణానికీ మేలు..
- 'బరువు' భారం లేదు.. జేబులో తీసుకెళ్ళొచ్చు..
- అయినా.. వాడకంపై మొగ్గు చూపని రైతులు
- అవగాహన కల్పిస్తే 'అన్నదాత'కు వరమే...

ఒకప్పుడు ఎరువులు కొనాలంటే.. వాటి ధరలు విని 'ఓరి నాయనో..' అని రైతులు ఆశ్చర్యపోయేవారు. ఇక.. ఆ బెంగ అవసరం లేదు. ఎందుకంటే.. పర్యావరణ హితమైన నానో ఎరువులు మార్కెట్లోకి వచ్చేశాయి. వీటిని వినియోగించడం వల్ల రైతులకు ప్రధానంగా 'బరువు' భారం తగ్గుతుంది. బస్తాతో పోలిస్తే ధర కూడా చాలా తక్కువే. మారుతున్న కాలానికి అనుగుణంగా, నానో ఎరువుల వినియోగాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న తరహాలో కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. సర్కారు ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ మార్కెట్లోకి 'నానో' ఎరువుల డబ్బాలను సరఫరా చేస్తోంది. వీటిని రైతులు సులువుగా జేబులో ఉంచుకుని పొలాలకు వెళ్లొచ్చు. రైతన్నలకు ఎంతో లాభం.. సౌలభ్యం కలిగించే 'నానో' ఎరువులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



యూరియా బస్తాలు

ఆధిక దిగుబడులు సాధించేందుకు రైతులు అనేక రసాయన ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు వినియోగిస్తున్న ఎరు వుల బస్తాల బరువు దాదాపు 50 కిలోలు. మార్కెట్ నుంచి ఇంటికీ.. అక్కడినుంచి పొలానికి ఈ బస్తాలను మోసుకెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అంతేగాక ఎరువుల బస్తాలను తరలించేందుకు కూలీలు, వాహన ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. అదనపు ఆర్థిక భారాన్ని మోయలేక రైతులు అప్పులపాల వుతున్నారు. బస్తాల్లోని ఎరువులను పంట పొలా లకు చల్లిన తరువాత, నీటి తడులు ఎక్కువైనా, సరిగా నీరు అందకపోయినా చల్లిన ఎరువు వృథా అవుతుంది. అయితే నానో ఎరువులతో ఆ పరిస్థితి మారబోతోంది.



మార్కెట్లో లిక్విడ్ రూపంలో ఉన్న నానో యూరియా

'నానో' గురించి అవగాహన లేకనే...

రాష్ట్ర ప్రభుత్వం నానో ఎరువుల వినియోగంపై ప్రధానంగా దృష్టి సారించింది. రైతులు నానో ఎరువులు వినియోగించేలా చర్యలు చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. దీంతో జిల్లా వ్యవసాయాధికారులు నానో ఎరువులను, నానో డీఏపీలను జిల్లాలోని పలు వ్యవ సాయ సహకార ప్రాథమిక సంఘాలకు పంపి రైతులకు అందుబాటులో ఉంచారు. అయితే నానో ఎరువుల వల్ల కలిగే లాభాలపై మాత్రం ఇప్పటికీ రైతులకు అవగాహన కల్పించడం లేదు. దీంతో పాపం.. రైతులు ఇంకా యూరియా బస్తాలనే భారంగా మోసుకుని వెళుతున్నారు. 'పక్క రైతులు ఎవరైనా నానో యూరియా వాడితే.. అప్పుడు మనమూ వాడదాంలే' అన్న భావనలోనే రైతులు ఉన్నా రు. వ్యవసాయాధికారులు ఇందుకోసం ప్రత్యేక అవగా హన సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది. 'పొలం పిలుస్తోంది' వంటి కార్యక్రమాల్లో పల్లె పల్లెకూ వెళ్లి విస్తృత స్థాయిలో తెలియజేయాల్సిన అవసరం చాలా ఉంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



నానో ఎరువుల వాడకం వల్ల నేలకు ఏ విధమైన నష్టమూ జరగదు. పర్యావరణానికి ఎలాంటి హానీ కలగదు, వీటిని డ్రోన్ల ద్వారా, స్ప్రేయర్ల ద్వారా పంటపై సులువుగా పిచికారీ చేసుకోవచ్చు. తద్వారా మొక్కకు నేరుగా 46 శాతం నత్రజని అందుతుంది. రైతులకు ఆర్థిక భారంతో పాటు శారీరక శ్రమ తగ్గుతుంది. రైతులకు అందుబాటులో ఉంచేలా గత వ్యవసాయ సీజన్‌లోనూ మనుబోలు పీఏసీఎస్‌లో ఉంచాం.

- వెంకటకృష్ణయ్య, మండల వ్యవసాయాధికారి

ధరలు తక్కువ... లాభాలు ఎక్కువ

మార్కెట్‌లో 50 కేజీల యూరియా బస్తా ధర రూ.266 ఉంది. డీఏపీ బస్తా ధర రూ. 1350. వీటిని పొలాల వద్దకు మోసుకెళ్లేందుకు రైతులకు అదనంగా ఖర్చువుతోంది. అదే నానో డీఏపీ 500 మి.లీ ధర కేవలం రూ. 625 మాత్రమే. నానో యూరియా ధర రూ. 265. వీటిని రైతులు సులువుగా తీసుకెళ్ళి పంటలకు పిచికారీ చేసుకోవచ్చు. డబ్బా సైజులో ఉండే నానో ఎరువుల కొనుగోలు వల్ల రైతులకు అదనపు భారం తగ్గిపోతుంది.

నూతన బార్ పాలసీతో ఔత్సాహికులకు అవకాశం

- ఎక్సైజ్ డీసీ

కందుకూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీతో ఔత్సాహిక వ్యాపారులకు అవకాశం వచ్చిందని, దీన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం. శంకరయ్య కోరారు. బుధవారం ఆయన కందుకూరు ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 55 బార్లకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, డిపాజిట్ మొత్తాలను కూడా గణనీయంగా తగ్గించిందన్నారు. కందుకూరులో ప్రస్తుతం మూడు బార్‌లకు అనుమతి ఉండగా, వాటితోపాటు గీతకార్మికుల కోటాలో మరో బార్‌కు అనుమతి లభించిందన్నారు. కందుకూరు సర్కిల్ పరిధిలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై ఆయన స్పందిస్తూ ఇటీవల విజిలెన్స్ తనిఖీలు నిర్వహించామన్నారు. అవసరమైతే లైసెన్సు రద్దుకు సిఫార్సు చేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ ఎస్. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శంకరయ్య

రైల్వే డీఆర్ఎం విస్తృత తనిఖీలు

- స్టాపింగ్ ఎత్తేసిన రైళ్లను ఆపాలని వినతులు

బిట్రగుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని పలు కార్యాలయాలను విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ మోహిత్ సొనాకియ బుధవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన ప్రత్యేక రైల్లో నెల్లూరుకి చేరుకున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం బిట్రగుంట రైల్వే స్టేషన్ చేరుకున్నారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో సిగ్నల్స్ ప్యానల్ బోర్డు, రికార్డులను తనిఖీ చేసి, క్రూకంట్రోల్ రూమ్ పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనానికి వచ్చిన ఆయన్ను క్రూకంట్రోల్ శేషయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. అక్కడ డ్రైవర్లు, గార్డుల ఉద్యోగ నియమావళి రికార్డులను పరిశీలించారు. పాత రన్నింగ్ రూమ్‌లో అదనపు నిర్మాణ పనులపై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న నూతన రన్నింగ్ రూమ్‌లను కూడా పరిశీలించారు. విశ్రాంతి భవన ఆవరణంలో డీఆర్ఎం మొక్కలు నాటారు. అనంతరం ఆయన ప్రత్యేక రైల్లో విజయవాడకు బయలు దేరారు.



రన్నింగ్ రూమ్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న రైల్వే డీఆర్ఎం

సమస్యలపై వినతులు

విజయవాడ రైల్వే డీఆర్ఎంను పలువురు కలిసి శాలువాలు కప్పి పూలమాలతో సన్మానించారు. అనంతరం వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందచేశారు. బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధి బోగోలు మండలంలో 49,847 మంది ప్రజలు ఉన్నారని తెలిపారు. వారిలో రైల్వే కార్మికులు 800, విశ్రాంతి రైల్వే ఉద్యోగులు 2వేల మందికి పైగా ఉన్నారని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందరాజులు డీఆర్ఎంకు వివరించారు. కాబట్టి గతంలో నిలుపుతున్న రైళ్లను తిరి గి నిలిపేలా ఆదేశించాలని వినతి పత్రం అంద చేశారు. క్రూచేంజింగ్ కోసం అనధికారంగా ఆగు తున్న బొకారో, తిరుమల, అండమాన్, లక్నో, కాకి నాడ ఎక్స్‌ప్రెస్‌లను అధికారకంగా నిలపాలని రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్ వినతిపత్రం అందచేశారు. బిట్రగుంటలో రైల్వే స్థలం 600 ఎకరాలు వృథాగా ఉందని, అందులో రైల్వే సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లాకార్యవర్గ సభ్యుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్, జైభీం అంబేడ్కర్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర తదితరులు కోరారు. సానుకూలంగా స్పందించిన డీఆర్ఎం ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు షెడ్యూల్ విడుదల

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అంతర జిల్లా బదిలీలకు అవకాశం కల్పిస్తూ షెడ్యూల్ విడుదలైనట్లు డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారి వారి మ్యానేజ్‌మెంట్‌లకు స్పౌజ్, మ్యూచువల్ ప్రాతిపదికన లీప్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 21 నుంచి 24వ తేదీలోపు మండల విద్యాశాఖాధికారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 22 నుంచి 25వ తేదీ వరకు మండల విద్యాశాఖాధికారి పరిశీలన ఉంటుందని తెలిపారు. 23 నుంచి 26వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వారు పరిశీలించి జాబితాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టరుకు పంపుతారని పేర్కొన్నారు. 28, 29తేదీల్లో జాబితాను పరిశీలించి తుది జాబితాను 30వతేదీన ప్రభుత్వానికి అందిస్తారని తెలిపారు.



యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, కలెక్టర్ ఆనంద్

పరిశ్రమల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యం

- జాబ్‌మేళాలో కలెక్టర్ ఆనంద్ • ఇండోసోలార్‌లో 68 మందికి ఉద్యోగావకాశాలు

గుడ్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటవుతున్న పరిశ్రమలతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. చేవూరులో బుధవారం ఇండోసోల్ కంపెనీ ఏర్పాటు చేసిన ప్రత్యేక జాబ్‌మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని అన్నారు. కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. సబ్‌కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడచూసినా పోర్టు ఆధారిత పరిశ్రమలు ఉన్నచోటే అభివృద్ధి జరిగిందన్నారు. ఇండోసోల్ కంపెనీ స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి భారతి మాట్లాడుతూ ఇండోసోల్‌లో ఉద్యోగాల కోసం స్థానిక యువత దరకాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఇండోసోల్ కంపెనీలో 68 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండోసోల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కే. బాలచందర్, ఇతర అధికారులు కృష్ణన్, బైరెడ్డి రంగారెడ్డి, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ తపన్ కుమార్ సాహా

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి అల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కార్యవర్గ సభ్యునిగా మేజర్ జనరల్ డాక్టర్ తపన్ కుమార్ సాహాను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ అంకిత మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ నెల బాధ్యతలు స్వీకరించనున్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు, గౌరవం

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పనిచేస్తే గుర్తింపు, గౌరవం తప్పకుండా లభిస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ తెలిపారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతి, నెల్లూరులో అవార్డులు అందుకున్న విద్యుత్ శాఖ అధికారులను బుధవారం నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ అవార్డులనేవి పనితనం, కృషి, అంకితభావానికి కొలమానమని, అవార్డు గ్రహీతలు మరింత బాధ్యత, నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. ఈఈలు శ్రీధర్, బెనర్జీ, రమేష్ చౌదరి, డీఈలు అశోక్, పవన్‌కు అభినందనలు తెలిపారు. పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ స్టాల్‌ను తక్కువ సమయంలో ఆకర్షణీయంగా రూపొందించిన ఏఈలు నస్రుల్లా, లక్ష్మీనారాయణను మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య, డీఈలు సునీల్, కిరణ్, మధు, ప్రభాకర్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎస్ఈ విజయన్

చేపల పెంపకంపై రేపటి నుంచి శిక్షణ

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి: నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివజ్యోతి, మత్స్య విభాగ శాస్త్రవేత్త శ్రీహరిసాదులు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈ నెల 28వతేదీ వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని, ఆక్వా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9154806577 నెంబరును సంప్రదించాలన్నారు.

జీవనోపాధులు మెరుగుకు చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు లింకేజీ రుణాలను ఇతోధికంగా ఇప్పించటం ద్వారా పొదుపు మహిళల జీవనోపా ధుల పెంపుదలకు చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి తెలిపారు. బుధవారం బ్యాంకు లింకేజీ రుణాలు, ఉన్నతి, స్త్రీనిధి, ఐబీ, ఫిషరీస్ తదితర కార్యక్రమాల అమలు తీరుపై డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జీవనోపాధుల కల్పనతో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పథకాల అమలుకు సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

ఉలవపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రోడ్డు దాటుతున్న చుక్కల దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెట్టు డిప్యూటీ రేంజర్ అధికారి చెన్నయ్య సంఘటనా స్థలానికి చేరుకుని చనిపోయిన దుప్పికి పంచనామా నిర్వహించారు. ఉలవపాడు వ్యవసాయశాఖ ఏడీ సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం దహనం చేసినట్లు డీఆర్‌వో తెలిపారు.

నేడు ఆత్మకూరులో నీటి సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని 3, 4, 5, 22 వార్డుల్లో తాగునీటి పైపులైను మరమ్మతుల కారణంగా గురువారం నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఆయా వార్డుల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9463
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ. 117.20

నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తుండడంతో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిగే వారు లేరులే అన్న ధీమాతో పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా ఎవరికి వారుగా తమ ఇష్టానుసారంగా గ్రామాలు, నివాసాలు, దుకాణాల సమీపంలో లెక్కకు మించి స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేసుకుంటుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఏమాత్రం నిబంధనలు పాటించకుండా సిమెంటుతో ఎత్తుగా కట్ట పోస్తుండడంతో పాటు తారుతో ఏర్పాటుచేసి చేతులు దులుపుకుంటున్నారు. అనంతరం వాటిపై ఎలాంటి రంగులు వేయకపోవడం, సూచిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో తమ పాలిట యమపాశాలుగా మారాయని వాహనదారులు వాపోతున్నారు. ఉదయగిరి పట్టణంతో సహా వెంగళరావునగర్, గంగిరెడ్డిపల్లి, గానుగపెంటపల్లి తదితర గ్రామాలతో పాటు వరికుంటపాడు మండలం తూర్పుబోయమడగల, వరికుంటపాడు, జీ.కొండారెడ్డిపల్లి, గొల్లపల్లి, దర్మవరం తదితర గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. వీటికితోడు పలు ప్రాంతాల్లో ప్రమాదకర మలుపులు ఉండడంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రి సమయాల్లో వాటిని గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన స్పీడ్‌బ్రేకర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సంగం: సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాదర్‌వలి


ఉదయగిరిలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సంగం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వం వైద్యశాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈనెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోకుండా మిగిలిపోయినవారికి మాత్రలు మింగించాలని సూచించారు. అదేవిధంగా టిబి ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా సీహెచ్‌సీకి గళ్ల పరీక్ష నిమిత్తం పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ అశోక్, హెల్త్‌సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●**ఆత్మకూరు :** ప్రైవేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా అడిషనల్ వైద్యాధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌వలీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు మింగడం వలన నులి పురుగులను నివారించవచ్చని వివరించారు. ముందుగా ఆయన అర్బన్ ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్త రానాల్డ్ రోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలలో ఆత్మకూరు అర్బన్ ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అస్మా, ప్రిన్సిపాల్ రమ్యశ్రీ, ఎంపీహెచ్‌ఏలు ఎస్ సుధాకర్, జి రవీంద్రరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యఆరోగ్య సిబ్బంది బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ఉదయగిరి పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వైద్యాధికారులు శివకల్పన, వినీతలు మాట్లాడుతూ దోమ కుట్టకుండా, పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా వ్యాధి దోమకాటు వలన వస్తుందని సర్‌రొనాల్డ్ రాస్ ప్రయోగాల వల్ల ధృవీకరించడంతో ఆయనకు నోబుల్ పురస్కారం వచ్చిందన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటేశ్వర్లు, ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, అంకమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్‌పార్టీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్నెం నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బి పెంచలయ్య, ఎన్ ఎంకటేశ్వర్లు, జె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు

నిధుల గోల్‌మాల్‌పై డీఎల్‌పీవో విచారణ

సీతారామపురం, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): మండలంలో విధులు నిర్వహిస్తూ దీర్ఘకాల సెలవుపై వెళ్లిన ఓ ఎంపీడీవో రూ.11 లక్షలకు పైగా నిధులను స్వాహా చేశారనే ఆరోపణలపై బుధవారం ఆత్మకూరు డిఎల్‌పిఓ టి రమణయ్య ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. నిధులు స్వాహాచేసిన ఎంపీడీవో ఇక్కడ విధుల్లో చేరినప్పటి నుంచి సెలవుపై వెళ్లే వరకు జరిపిన బ్యాంకు లావాదేవీల రికార్డులను పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది సహాయ సహకారాలపై కూడా ఆరాతీసి సమగ్ర వివరాలు సేకరించారు. తుది నివేదికను జడ్పీ సీఈఓకు అందిస్తామన్నారు. అనంతరం అయ్యవారిపల్లి, బసినేనిపల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సాయి ప్రసాద్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


విచారిస్తున్న ఆత్మకూరు డీఎల్‌పీవో

పంచాయతీల్లో డీఎల్‌పీవో పర్యటన

●**వింజమూరు :** మండలంలోని కాటేపల్లి, చాకలికొండ పంచాయతీలలో బుధవారం కావలి డీఎల్‌పీఓ రమణ వింజమూరు ఈవోపీఆర్‌డీ కె.రామారావుతో కలిసి పర్యటించారు. కేంద్ర రంగ పథకమైన సుమిత్వ కార్యక్రమం అమలుకోసం ఆయన పంచాయతీలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు శేఖర్, నరసింహ, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా సంగం పీఏసీఎస్ చైర్మన్ ఎంపిక

సంగం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా సంగం పీఏసీఎస్ చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఏఎంసీ డైరెక్టర్‌గా నియమించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, అదేవిధంగా నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు, కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ల రద్దు అన్యాయం

- ఎంపీడీవోకు దివ్యాంగుల మొర

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): ఎన్నో ఏళ్లుగా తీసుకుంటున్న తమ పింఛన్లను రద్దు చేయడం అన్యాయమని బుధవారం పలువురు దివ్యాంగులు ఎంపీడీవో గోపిశ్రీనివాస్ ఎదుట తమ గోడు వినిపించారు. తూర్పు బోయమడగల, నల్లబోతుల వారిపల్లి, అలివేలుమంగాపురం, రామాపురం తదితర గ్రామాల నుంచి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులమైన తమకు పింఛను రద్దు చేయడంతో జీవనం సాగించడం భారంగా మారుతుందని వాపోయారు. ఇప్పటికైనా సమగ్రంగా విచారించి తమకు న్యాయం చేయాలని ఎంపీడీవోను వేడుకున్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రాలు అందిస్తున్నదివ్యాంగులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం ఎంపిక

- మంత్రి ఆనంను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఎంసీ వైస్‌చైర్మన్ బుజ్జిరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గాన్ని నియమిస్తూ అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ చైర్మన్‌గా ఆరికట్ల జనార్దన్‌నాయుడు, వెస్ చైర్మన్‌గా గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, సభ్యులుగా ఇండ్ల శ్రావణి, టి రోశమ్మ, పి పెంచలయ్య, డి బాలమ్మ, బంకా సుబ్బారెడ్డి, నంది ప్రభావతి, షేక్ షర్మిల, సీహెచ్ హేమలత, ఉక్కాల శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య, జువ్విగుంట బుజ్జమ్మ, దేవరాల గంగాధర్‌యాదవ్, వడ్డిబోయిన లక్ష్మిరెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా నూతన ఏఎంసీ వెస్ చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా గొట్టిగుండాల బుజ్జిరెడ్డి రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి పాల్గొన్నారు.


మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి బహుమతిని అందజేస్తున్న ఏఎంసీ వైస్‌చైర్మన్ బుజ్జిరెడ్డి

స్వచ్ఛమైన ఓటరు జాబితాకు సహకరించాలి : ఈఆర్వో

ఉదయగిరి, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గంలో స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 3,27,297 లక్షల మంది జనాభా ఉండగా 2,41,742 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని 323 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించడంతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు వారికి సంబంధించి బూత్ లెవల్ ఏజంట్లను నియమించుకుని వివరాలు అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈఆర్వో ఎల్ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ నీహ, రాజకీయ పార్టీల నాయకులు బయ్యన్న, బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో మురళి

బిగ్ బ్యాగ్ పద్ధతి ద్వారా చెత్త సేకరించాలి : సీఈవో

మర్రిపాడు, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి) : బిగ్, బ్యాగ్ పద్ధతి ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి, చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సిఈవో మోహన్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మర్రిపాడు మండలం అల్లంపాడు సచివాలయాన్ని సందర్శించారు. అల్లంపాడు గ్రామంలో చెత్తసేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పారిశుధ్యంపై అశ్రద్ధ చూపుతున్నట్లు ఐవిఆర్‌ఎస్ కాల్ ద్వారా అధికంగా ఫిర్యాదులు అందడంతో పరిశీలనకు వచ్చినట్లు సిఈవో తెలిపారు. గ్రామంలో పనులపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో రెండు చెత్త రిక్షాలు ఏర్పాటుచేసి చెత్తను సేకరించాలని, అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ, సచివాలయాల భవనాల నిర్మాణాలను తిరిగి ప్రారంభించేలా చూడాలని ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్‌కి సూచించారు. ఆయన వెంట డిప్యూటి ఎంపీడీవో సికిందర్ తదితరులున్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఈవో మోహన్‌రావు

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్‌ఐ

ఉదయగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వినాయక విగ్రహం ఏర్పాటుచేసే కమిటీ తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటుచేసే ప్రాంతం, నిమజ్జనానికి తరలించే తేదీ, కమిటీ సభ్యుల వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా డీజేలు, పాటకచ్చేరీలకు ఎలాంటి అనుమతుల్లేవన్నారు. విగ్రహాల వద్ద విద్యుత్ ఏర్పాటు, మైక్‌సెట్ నిర్వహణకు అనుమతులు ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలను నిర్వహించుకుని పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

- ఆజంఖాన్, ఏపీవో

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించి గిట్టుబాటు నగదు అందేలా చర్యలు చేపడతామని ఏపీవో ఆజంఖాన్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య సాధనకు తనవంతు కృషి చేస్తానని ఏపీవో తెలిపారు.

? మండలంలో ఉపాధి హామీ పథకం అమలు తీరు ఎలా ఉంది.

! ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కేవలం ఆరేడు పంచాయతీల్లో మాత్రమే పనులు చేపట్టడం జరుగుతోంది. ఒక్కో కూలికి సరాసరి రూ. 230 వరకు గిట్టుబాటు అవుతుంది.

? బినామీ మస్టర్ల నిరోధానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ అలాంటి వాటికి అవకాశం లేకుండా చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం త్వరలో అమలుచేయనున్న ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా తీసుకొనే ముఖ హాజరుతో బినామీలకు అవకాశం లేకుండా పోతుంది.

? శ్రామికుల నుంచి అదనపు నగదు ఎందుకు వసూలు చేస్తున్నారు.

! పలు పంచాయతీల్లో వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చింది. ప్రత్యేక నిఘా ఉంచి అలాంటి వారిపై చర్యలు చేపడతాం. శ్రామికులు ఎవరికీ నగదు చెల్లించాల్సిన అవసరం లేదు.

? రాయితీ పథకాలు అమలు చేస్తున్నారా.

! సన్న, చిన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం కోసం పూర్తిస్థాయి రాయితీ అందజేయడం జరుగుతుంది. జాబ్‌కార్డు, సాగునీటి వసతి ఉన్న రైతులకు మూడేళ్ల పాటు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

న్యూస్ బాక్స్

సబ్‌ట్రెజరీ కార్యాలయం తనిఖీ


జిల్లా ట్రెజరీ అధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని జిల్లా ట్రెజరీ అధికారి జి గంగాధర్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా సబ్‌ట్రెజరీ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సబ్ ట్రెజరీ అధికారి షేక్ నవాజ్, షేక్ అఫ్రోజ్‌బాషా, సిబ్బంది బి సుప్రియ, టి రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో కళాపకర్షణ

ఉదయగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో బుధవారం పూర్వ రామాలయ కళాపకర్షణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో పాత రామాలయాన్ని పడగొట్టి నూతన రామాలయం నిర్మించేందుకు గ్రామస్థులు చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివార్లకు గణపతి పూజ, అభిషేకాలు, పూజలు, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయంలో విగ్రహాలను తొలగించారు. అనంతరం శాస్త్రోక్తంగా విగ్రహాలను సమీపంలోని బాలాలయంలో కొలువుదీర్చారు.

ఘనంగా గంధ మహోత్సవం


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గంపై గల జట్‌పట్‌బీబీ దర్గాలో బుధవారం గంధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా గంధాన్ని హక్కుదారుల ఇంటి నుంచి దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

C.R.I.M.E N.E.W.S


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

డ్రోన్‌తో చిత్రీకరించిన నిందితుల అరెస్ట్

- మాజీ ఎమ్మెల్యేతోపాటు నలుగురిపై కేసు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీధర్

కావలి రూరల్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డిపై హత్యాయత్నం చేసేందుకు క్రషర్స్ వద్ద డ్రోన్‌తో చిత్రీకరించిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి, వారిలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి డీఎస్పీ శ్రీధర్ మీడియాకు ముద్దాయిల వివరాలు వెల్లడించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి జలదంకి మండలం అన్నవరంలోని గురురాఘవేంద్ర క్రషర్స్ వద్దకు రాగానే, దాడి చేసేందుకు ఏ5 ముద్దాయి అయిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో ఎమ్మెల్యే కదలికలపై రెక్కీ నిర్వహించారు. అక్కడకు ఎమ్మెల్యే వస్తారని ఆయన రాకను గమనించాలని డ్రోన్‌తో చిత్రీకరిస్తున్న ఏ1 ముద్దాయి ఇస్సారపు వేణు, ఏ2 గోళ్ల వినోద్‌కుమార్, ఏ3 దామెర్ల శ్రావణ్‌కుమార్, ఏ4 ఆత్మకూరి రాజేష్‌లను అక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్ సొంగా ఏడుకొండలు, సిబ్బంది పసిగట్టి మీరెవరని అడ్డుకోబోగా వారిపై కూడా రాళ్ల, కత్తులతో దాడిచేసి చంపే ప్రయత్నం చేశారన్నారు. అక్కడ పని చేసేవారంతా రావటంతో నలుగురు అక్కడ నుంచి పరారైనట్లు తెలిపారు. సూపర్‌వైజర్ ఏడుకొండలు ఫిర్యాదుతో జలదంకి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జలదంకి మండలం జమ్మలపాలెం వద్ద వేణు, వినోద్ కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. మిగిలిన ముద్దాయిలను పట్టుకునేందుకు స్పెషల్ టీంలు ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. కలిగిరి ఎస్‌ఐ ఉమాశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై కారు బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు.. సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు పని నిమిత్తం కారులో నెల్లూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈనేపథ్యంలో దాసరిపల్లి గ్రామ సమీపానికి రాగానే ఒక్కసారిగా అటవీ ప్రాంతం నుంచి పందులు రోడ్డుపైకి రావడంతో వాటిని ఢీకొని కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు కాగా, కారు దెబ్బతింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మినీ వ్యాన్ ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్ నుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయుడిని మినీ వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు. ఏపీ ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్య ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నరేష్ సెంటర్ నుంచి పాఠశాలకు వెళుతున్నాడు. ఈతరుణంలో కావలి నుంచి మైదుకూరుకు వెళుతున్న మినీ వ్యాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా మలుపు తిప్పడంతో ప్రమాదవశాత్తు ఉపాధ్యాయుడి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంపై ఎస్‌ఐ ఆదిలక్ష్మీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో దంపతుల దుర్మరణం

- స్వల్పగాయాలతో బయటపడ్డ ఇద్దరు పిల్లలు
- కల్వర్టును ఢీకొట్టిన బొలెరో కారు
- బాధితులు మనుబోలు వాసులు


ప్రమాద స్థలంలో నుజ్జు నుజ్జైన బొలెరో కారు

లింగాలఘణపురం, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి) : జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల వద్ద జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దద్దోలు సురేశ్(36), దివ్య (30) దుర్మరణం పాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన సురేశ్ అతడి భార్య దివ్య, పిల్లలు మోక్షజ్ఞ్, లోక్షణతో కలిసి కరీంనగర్‌లో నివాసముంటూ ఓ గ్రానైట్ ఇండస్ట్రీలో గ్రానైట్ మార్కర్‌గా పనిచేస్తున్నారు. కాగా స్వస్థలం వడ్లమూడి నుంచి కరీంనగర్‌కు తెల్లవారుజామున కారులో భార్యాపిల్లలతో కలిసి బయలుదేరారు. ఈ క్రమంలో జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై అతివేగంగా వచ్చిన కారు సురేశ్ నిద్రమత్తు కారణంగా అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా డ్రైవింగ్ చేస్తున్న సురేశ్‌తో పాటుగా అతని వెనుక సీటులో కూర్చున్న భార్య దివ్య తీవ్రగాయాలపాలై కారులో ఇరుక్కుపోయారు. వెంటనే సమాచారం అందుకున్న లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానికుల సాయంతో కారులో నుంచి బయటకు తీసి 108 ద్వారా జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా సురేశ్ మార్గమధ్యలోనే మృతి చెందగా అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న దివ్య ఆసుపత్రిలో మృతిచెందింది. ఇద్దరు పిల్లలు మోక్షజ్ఞ్, లోక్షణ స్వల్పగాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇద్దరి మృతదేహాలను జిల్లా ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచినట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు.



మృతిచెందిన సురేశ్, దివ్య

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 525

హెచ్ఐవీ సంబంధిత వ్యాధులపై అవగాహన

అల్లూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ జే.రూత్‌బేనోమి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా అల్లూరు రామకృష్ణ డిగ్రీ కళాశాల, నాగాలమ్మ కాలువ కట్ట ప్రాంతాల్లో బుధవారం హెచ్ఐవీ అనుబంధ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు అనే అంశంతోపాటు అనుబంధ వ్యాధులైన క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఫీల్డ్ స్టాఫ్ జయమ్మ, అనిత, కృష్ణవేణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.



జలదంకి ఎంఈవో-1గా పద్మనాభరావు


ఎంఈవో-1గా బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మనాభరావు

జలదంకి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎంఈవో-1గా నందనవనం పద్మనాభరావు బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న శ్రీధర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పద్మనాభరావును ఎంఈవో-2 నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పీఏసీఎస్ అధ్యక్షుడు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడితో సభ్యులు, అధికారులు

కొండాపురం,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడవళ్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాయిపేటలో ఉన్న సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడిగా కుంకు మోహనరావు, కార్యవర్గ సభ్యులుగా మాలేపాటి స్రవంతి, కాకుటూరు రాఘవులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మోహనరావు మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులకు ప్రభుత్వం ద్వారా అందే అన్ని పథకాలను అందేలా చూస్తానన్నారు. ఈసందర్భంగా పలువురు రైతులు అధ్యక్షుడిని, సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ. బీజేపీ. జనసేన నాయకులు, సొసైటీ సీఈవో మాల్యాద్రి, వీఏఏ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విట్స్‌లో మెగా వైద్య శిబిరం

కావలి(టౌన్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): విట్స్ ఇంజినీరిగ్ కళాశాలలో బుధవారం నెల్లూరు మెడికవర్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుండె వైద్యనిపుణులు డాక్టర్ బాలకృష్ణ మాట్లాడారు. ప్రతిఒక్కరూ గుండె ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. గైనకాలజిస్ట్ మన్నెం అనూష మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ రాకుండా వ్యాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు, అధ్యాపకులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా ది పూర్ పీపుల్స్ వలంటీర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో మెడికవర్ ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ హరిప్రియ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చేవూరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో చెప్పారు.ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని తెలిపారు.

పరిమితికి మించితే ప్రమాదం జరగదా..!?

● కిక్కిరిసి ఆటోల్లో ప్రయాణం ● బస్సు సౌకర్యం లేక విద్యార్థుల అగచాట్లు

కలిగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలకు ప్రయాణించే ఆటోలు పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళుతున్నా యి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి దూరంగా ఉన్న హైస్కూల్, ఏపీ మోడల్‌స్కూల్‌కి వెళ్లే విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యంలేదు.దీంతో ఆటోల్లో ప్రయాణాలు చేయాల్సి వస్తున్నది. జడ్పీ, మోడల్ స్కూల్‌కి సుమారు 1000మంది విద్యార్థులు నిత్యం వెళుతుంటారు. పట్టణప్రాంతంలోని విద్యార్థులను వారి తల్లిదండ్రులు సైకిళ్లపై పంపడమో లేదా మోటార్‌సైకిళ్లపై తీసుకువెళ్లి వదలేసి రావడమో చేస్తారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఆటోలపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఆటోవాలాలు ముగ్గురు, నలుగురు విద్యార్థులను తీసుకువెళితే.. తమకు గిట్టుబాటు కాదని, సుమారు 10 నుంచి 15మందిని తీసుకువెళుతున్నారు. ఇలా తీసుకువెళ్లే క్రమంలో ఆటోలో డ్రైవరుకు ఇరుపక్కల విద్యార్థులు కూర్చోవడంతోపాటు. పుస్తకాల బ్యాగులతో ఆటోల వెనుక ప్రమాదకంగా ప్రయాణించడం కనిపిస్తున్నది. తమ చిన్నారులు క్షేమంగా ఇళ్లకు చేరాలంటే సాయంత్రం సమయంలో ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

అల్లూరులో ప్రతాప్ దిష్టిబొమ్మ దహనం


అల్లూరులో ప్రతాప్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు


కావలి ఎంపీడీవో కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

అల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే అనుచరులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై అల్లూరులో బుధవారం సాయంత్రం కూటమి నేతలు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సోమశిల ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ మాట్లాడుతూ ప్రతాప్ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టి పాతబస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, రేబాల శంకర్‌రెడ్డి, పాపనబోయిన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

● హత్యాయత్నం కోసమే డ్రోన్ చిత్రీకరణ

కావలి,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిపై హత్యాయత్నం కోసమే అన్నవరంలోని ఆయన క్వారీలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ డ్రోన్ చిత్రీకరణ చేయించారని కూటమి నేతలు ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబునాయుడు, పోట్లూరు శ్రీనివాసులు, తటవర్తి వాసు, తిరువీధి ప్రసాద్, జనిగర్ల హేంద్ర, దేవకుమార్, అయేషా బేగం, యల్లంటి వెంకటేశ్వర్లు, బీజేపీ నేతలు బెల్లంకొండ మాల్యాద్రి, జనసేన నేతలు పొబ్బాసాయి విఠల్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. చిత్రీకరణకు వెళ్లినవారు మారణాయుధాలతో వెళ్లటమే కాకుండా, రౌడీషీటర్లను ఎందుకు తీసుకుపోయారని ప్రశ్నించారు. ఎవరి పాలనలో అక్రమకేసులు పెడతున్నారో అందరికీ అర్థమవుతోందని వారన్నారు.

● ఎమ్మెల్యేపై హత్యాయత్నం దుర్మార్గపు చర్య

అల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యేపై హత్యాయత్నం దుర్మార్గపు చర్య అని టీడీపీ సీనియర్ నాయకుడు బండి అమర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనను ఖండిస్తూ సింగపేటలో బుధవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పదేళ్లు ఎమ్మెల్యేగా ఉంటూ ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇదేనా నేర్చుకున్నదని మండిపడ్డారు. ఇటువంటి దుర్మార్గపు ఆలోచనలు కలిగి ఉండటాన్ని ప్రజలు విశ్వసించరని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లపోలు రామకృష్ణారెడ్డి, చాగంటి రామకృష్ణారెడ్డి, దివి ప్రసాద్, శ్రీహరి, గంటా కుమార్, పులి వెంకట రమణయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను హతమార్చేందుకే రెక్కీ

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని హతమార్చేందుకే అన్నవరం క్రషర్ వద్ద మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనుచరులు డ్రోన్‌తో రెక్కీ నిర్వహించారని టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ పేర్కొన్నారు. పట్టణ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం రూరల్ మండల టీడీపీ నేతలు నల్లబ్యాడ్జీలతో నిరసన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పాల వెంకట్రావు , చింతం బాబుల్ రెడ్డి, మక్కి శ్రీహరి, సూరె జయశ్రీ, సోమయ్యగారి రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే చలంచర్ల గ్రామంలో గుర్రం సునీల్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమం లో స్థానిక టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలు బయటపడతాయనే ఆరోపణలు : వైసీపీ

కావలి(టౌన్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి చెందిన అన్నవరం క్వారీలో అవినీతి, అక్రమాలు బయటపడతాయనే హత్యాయత్నం ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపించారు. బుధవారం ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, పందిటి కామరాజు, కుందుర్తి కామయ్య, వీరరఘు తదితరులు విలేకరులతో మాట్లాడారు. క్వారీలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలికితీసేందుకు వైసీపీ మీడియా చూస్తున్న వేణు డ్రోన్ ఆపరేటర్‌తో కలిసి ఫొటోలు చిత్రీకరించడం తప్పా అని ప్రశ్నించారు. వారిని పట్టుకుని చితకబాదడం అప్రజాస్వామ్యమన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడమని, న్యాయపోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

సబ్ కలెక్టరును కలిసిన మాజీ ఎమ్మెల్యే

కందుకూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టరుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దామెర హిమవంశీని మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి సభ్యులు బుధవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను వారు సబ్ కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. శివరాం వెంట అభివద్ధి మండలి సభ్యులు పాలేటి కోటేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు, కాకుమాని మాధవరావు తదితరులున్నారు.


సబ్‌కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

సర్ రోనాల్డ్‌రాస్‌కి నివాళి

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో బుధవారం వైద్యశాస్త్రంలో నోబెల్‌బహుమతి పొందిన డాక్టర్ సర్ రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, వైద్యసిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, సీహెచ్ఎన్ఎఫ్ మేరి సిబ్బంది పాల్గొన్నారు.

తీగలు మార్చారు.. స్తంభాన్ని అలా ఉంచేశారు!

కావలి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ రోడ్డులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉండేది. స్థానికుల ఫిర్యాదుల మేరకు స్తంభాన్ని మార్చేందుకు దానికి ఉన్న తీగలను అధికారులు తొలగించారు. అయితే అక్కడ ఉన్న స్తంభాన్ని తొలగించకుండా అలాగే వదిలి వేశారు. దీంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై ఉన్న స్థంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



రథం నిర్మాణ పనుల ప్రారంభం


రథం నిర్మాణ పనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో రథం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల నాటికి పనులు పూర్తి చేసి, రథోత్సవం నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ముందుగా స్వామివారి దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్. సుబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రసాయనిక ఎరువుల వాడకంతో తగ్గనున్న భూసారం

● బిట్రగుంట మండల వ్యవసాయ అధికారిణి శైలజ

ఇంటర్వ్యూ

బిట్రగుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గి పంటకు సాగుకు అధికంగా ఖర్చు అవుతుందని మండల వ్యవసాయ అధికారిని బీ.శైలజ తెలిపారు.

? : పంటల సాగుకి పెరుగుతున్న పెట్టుబడులకు రైతులకు ప్రభుత్వం ఎటువంటి సహాయం అందిస్తుంది.

! : రైతుల వ్యవసాయానికి సంబంధించి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా మూడు విడతలుగా 20 వేల రూపాయలు పెట్టుబడికి ప్రభుత్వం అందచేస్తుంది. ప్రభుత్వం రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందచేస్తు వ్యవసాయాని ప్రోత్సహిస్తుంది.

? : ప్రభుత్వ పథకాలు రైతులు పొందాలంటే ఏం చేయాలి.

! : ప్రతి రైతు విధిగా పంటసాగు వివరాలను ఈ పంట యాప్‌లో నమోదు చేసుకోవాలి, దానిని ప్రామాణికంగా తీసుకొని రైతులకు ప్రభుత్వ పథకాలు అందచేయడం జరుగుతుంది.

?: వ్యవసాయంలో కూలిల కొరతను ఎలా అధిగమిస్తారు.

! : వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా తక్కువ సమయంలో కూలిలు లేకుండా సులభంగా పనులు చేసుకోవచ్చు

? : కౌలు రైతుల పథకాలు వివరించండి

! : ప్రతీ కౌలు రైతు సీసీఆర్‌సీ కార్డు తీసుకుంటే, వారికి రూ. 20 వేల పెట్టుబడి సాయం అందుతుంది. మద్దతుకు ధాన్యం అమ్ముకునేందుకు వీలుంటుంది.

? : భూసారం పెంచుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి.

! : రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, పంటకు ముందు భూమిలో సారం పెంచేందుకు పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి. పశువుల ఎరువును నేలకు అందించాలి.

ఖాతాల్లో నగదు జమ కాకుంటే ఆర్ఎస్‌కేలో సంప్రదించాలి

కందుకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం నగదు ఖాతాకు జమకాని రైతులు తగిన ఆధారాలతో ఆర్ఎస్‌కేలో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌కె అబ్దుల్‌రహీం కోరారు. మండలంలోని కొండికందుకూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌కేలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏవో మాట్లాడారు. ప్రతిరైతుకు అన్నదాత సుఖీభవ పథకం నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో నరిశెట్టివారిపాలెం సర్పంచి ముప్పా శ్రీనివాసులు, వీఏఏ శిరీష తదితరులు పాల్గొన్నారు



లింగసముద్రం : వరి పైరును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి హర్షవర్ధన్ తదితరులు

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము సాగు చేసిన పైర్ల వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి కే. హర్షవర్ధన్ చెప్పారు.బుధవారం ఆయన మండలంలోని చినపవని, పెదపవని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన వరి పైరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ హరికృష్ణ, ఏఎంసీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పచ్చిరొట్ట విత్తనాలతో ప్రయోజనం

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలతో రైతుకు ప్రయోజనం చేకూరుతుందని వింజమూరు ఏడీవో శేషగిరిరావు పేర్కొన్నారు. బుధవారం నాగసముద్రంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జహీర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటరత్నం, ఏఈవో చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

త్వరలో ముగియనున్న పొగాకు కొనుగోళ్లు!

(5వ పేజీ తరువాయి)

మొత్తం పొగాకు అమ్మకాలు పూర్తవ్వాలంటే ఈ ఏడాది నవంబరు వరకు వేలం కేంద్రాలు నిర్వహించాల్సి రావచ్చని, అయితే నేటికీ అనధికారిక పొగాకు కొనుగోళ్లకు బోర్డు, కేంద్ర వాణిజ్యశాఖల నుంచి అనుమతులు రాకపోవడం ఆందోళన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు.

● అపరాధ రుసుముపైనా సస్పెన్స్

అనధికారిక పొగాకు విక్రయాలపై గతంలో ఉన్న అపరాధ రుసుమును కేంద్ర వాణిజ్య శాఖ రద్దు చేయడం రైతులకు ఊరటనిచ్చింది. బోర్డు అనుమతికి మించి పండించిన పొగాకు అమ్ముకోవాలంటే రైతులు క్వింటాకు రూ.200, మొత్తం విలువలో 5 నుంచి 15 శాతం వరకు బోర్డుకు అపరాధ రుసుము చెల్లించే విధానం గతంలో అమలులో ఉండేది. గత రెండేళ్ల అపరాధ రుసుము పూర్తిగా మినహాయింపు ఇవ్వటంతో రైతులకు లక్షలాది రూపాయలు లబ్ధి చేకూరింది. ఈ తరుణంలో ఈ ఏడాది అనధికారిక పొగాకు దిగుబడి అధికంగా ఉన్నందున అపరాధ రుసుము చెల్లించాలంటే ప్రతి రైతుకు వేలాదిరూపాయలు అదనపు భారం పడే అవకాశం ఉంది. ఈ స్థితిలో ఈ ఏడాది కూడా అపరాధ రుసుము మినహాయింపు ఇస్తూ అనధికారిక పొగాకు కొనుగోళ్లకు తక్షణం అనుమతులు వచ్చేలా చూడటం ద్వారా వేలం కేంద్రాలు నిలిచిపోకుండా వేలం ప్రక్రియ జరిగేలా చూడాలని రైతులు కోరుకుంటున్నారు.

● ధరలో కదలిక.. చిగురిస్తున్న ఆశలు

పొగాకు వేలం కేంద్రాల్లో అధికారిక పొగాకు విక్రయాలు పూర్తయ్యేదశలో ధరల్లో కదలిక ప్రారంభం కావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొన్ని నెలలుగా అత్యధిక ధరపై కిలోకు రూ.280 వద్ద సీలింగ్ పెట్టి కొనుగోళ్లు చేస్తూ వచ్చిన వ్యాపారులు 2, 3 రోజులుగా సీలింగ్ పరిధి దాటి నాణ్యమైన పొగాకు బేళ్లకు రూ.281 ధర వేస్తుండటం విశేషం. అలాగే లో గ్రేడ్‌లు, మీడియం గ్రేడ్‌ల పొగాకుకు కూడా క్వింటాకు రూ.వెయ్యి వరకు ధరపెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. సీలింగ్ పరిధి దాటి ధర పెట్టినందున రానున్న రోజుల్లో ధర పెరిగే అవకాశాలు లేకపోలేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆశతో రైతులు ప్రస్తుతం నాణ్యమైన పొగాకును వేలంకు పెట్టకుండా లో గ్రేడ్‌లు, మీడియం గ్రేడ్‌లనే అధికంగా తెస్తున్నారని హైగ్రేడ్ పొగాకు బేళ్లను కోల్డ్‌స్టోరేజీల నుంచి బయటకు తీస్తే ధర మరికొంత పెరిగే అవకాశం లేకపోలేదని బోర్డు అధికారులు సైతం అభిప్రాయపడుతున్నారు. అనుమతుల కోసం వేలం కేంద్రాలను నిలిపివేయాల్సిన పరిస్థితి రాకుండా అధికారిక పొగాకు విక్రయాలు పూర్తయ్యేలోపే అనధికారిక పొగాకు విక్రయాలపై మార్గదర్శకాలు వస్తే రైతుకు మేలు జరుగుతుందని ఆ దిశగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీటీసీకి కంప్యూటర్ల వితరణ

కందుకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శిక్షణ కళాశాల(డీటీసీ)లో కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం కాబోతున్న సందర్భంగా స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం రెండు కంప్యూటర్లను ఉచితంగా అందజేసింది. కరస్పాండెంట్ కే. విజయ్‌శ్రీనివాస్ బుధవారం ఈ కంప్యూటర్లను రూరల్ ఎస్ఐకు అందజేసి డీటీసీకి చేర్చాలని కోరారు. కానిస్టేబుళ్లకు సైబర్‌క్రైంపై అవగాహన, నూతన సాంకేతికతపై శిక్షణ నిచ్చేందుకు ఈ కంప్యూటర్లు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.


కంప్యూటర్లు అందచేస్తున్న కరస్పాండెంట్ విజయ్‌శ్రీనివాస్

విద్యార్థుల స్థాయికి తగ్గట్టు బోధన

దగదర్తి, (బిట్రగుంట), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయికి తగిన విధంగా విద్యాబోధన అందించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు ఉపాధ్యాయులకు సూచించారు. దగదర్తి మండల కేంద్రం, ఉచగుంటపాలెం జడ్పీహైస్కూళ్లను, దగదర్తి బీసీ, భవితా సెంటర్, తడకలూరు మోడల్ పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అలాగే దగదర్తి జడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజన మెనూ నిర్వహణను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఈవో భాస్కర్‌కు గ్రంథాలయ పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఎంఈవో భాస్కర్‌కు పుస్తకాలు అందచేస్తున్న ఏఎంవో సుధీర్‌బాబు

గణేష్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

కావలి(టౌన్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి) : పట్టణ బ్రిడ్జి కూడలిలో బుధవారం గణేష్ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు సిద్ధు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విక్రమ్ రెడ్డి, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కందుకూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డులో 11కేవీ ఫీడర్‌లో లైన్‌వర్క్ ఉన్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. గాయత్రీనగర్, కొత్తకుమ్మరిపాలెం, ప్రశాంతినగర్, సింహాద్రినగర్, ఎర్రవడ్డిపాలెం, పామూరుబస్టాండ్ ఏరియా, వెంకటేశ్వరనగర్ ప్రాంతాలకు ఉదయం గం. 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

అర్థం అయ్యేలా బోధించాలి

లింగసముద్రం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : 1, 2 తరగతుల విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ప్రకాశం జిల్లా షైనంపాడు డైట్ లెక్చరర్ విజయకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని వెంగళాపురం ప్రాథమిక పాఠశాలను, పెదపవనిలోని జడ్పీ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయా రికార్డులను పరిశీలించారు.మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 కే. మాల్యాద్రి, ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బార్‌లకు ఎవరెన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు

కావలి,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): బార్‌లకు ఓ వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని కావలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం బార్ అండ్‌రెస్టారెంట్ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నూతన బార్ పాలసీ గురించి వివరించారు. ఈనెల 26 వరకు బార్‌లకు ఆన్‌లైన్ ద్వారా కానీ, ఆఫ్‌లైన్ ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మద్యం దుకాణదారులు కూడా బార్‌లకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ కార్యాలయం ఫోన్ 9440902521 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.


బార్, రెస్టారెంట్ నిర్వాహకులతో సమావేశమైన ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

తిరుమలకూ హ్యాప్రీ బస్!

- ఏటా 25 లక్షల మంది మహిళలకు లబ్ధి
- ప్రభుత్వంపై రూ.23 కోట్ల అదనపు భారం
- త్వరలో మార్గదర్శకాలు జారీ అయ్యే అవకాశం

తిరుపతి-తిరుమల నడుమ కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేసిన ప్రకటన మహిళా యాత్రికులను మహదానందానికి గురిచేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి ఉచితంగానే తిరుపతికి చేరుకున్నా తిరుమలకు మాత్రం చార్జీలు చెల్లించాల్సిరావడం వీరిని అసంతృప్తికి గురిచేసింది. తాజా నిర్ణయం అమలు తేదీ కోసం వీరంతా ఎదురు చూస్తున్నారు. నిజానికి తిరుమలకు ఉచితం చేయడం వల్ల ఆర్టీసీ మీద పడే భారం కూడా ఏమంత ఎక్కువ కాదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తే ఏటా పాతిక లక్షల మందికి పైగా మహిళా ప్రయాణికులకు లబ్ధి చేకూరనుంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.23 కోట్ల వరకూ భారం పడనుంది. ఈనెల 15వ తేదీ నుంచీ రాష్ట్రవ్యాప్తంగా నిర్ధిత ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే తిరుపతి-తిరుమల మధ్య నడిచే ఆర్టీసీ బస్సుల్లో మాత్రం మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం వర్తించదని ప్రకటించిడం తెలిసిందే. దీనిపై వివిధ వర్గాల నుంచీ వచ్చిన విన్నపాలు, సలహాలు, సూచనలతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. దీంతో తిరుపతి-తిరుమల నడుమ మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వర్తింపజేయాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు మంగళవారం ఆర్టీసీ ఛైర్మన్ ప్రకటించారు. ఆ నిర్ణయం అమల్లోకి వస్తే ప్రభుత్వంపై రూ. 23 కోట్లు అదనపు భారం పడనున్నప్పటికీ ప్రభుత్వం సంతోషంగానే దానికి సిద్ధపడుతున్నట్టు సమాచారం.

ఏటా పాతిక లక్షల మందికి ప్రయోజనం

ప్రస్తుతం తిరుపతి-తిరుమల నడుమ 298 డీజిల్ బస్సులు, 64 ఏసీ సదుపాయంతో కూడిన ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో ఏసీ కలిగిన ఎలక్ట్రిక్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం లేదు. మిగిలిన బస్సులు తిరుపతి-తిరుమల నడుమ రోజుకు 1160 ట్రిప్పులు (రానుపోను కలిపి ఒక ట్రిప్పు) తిరుగుతున్నాయి. వీటిల్లో రోజుకు 45 వేల మంది తిరుమల- తిరుపతి నడుమ ప్రయాణిస్తున్నారు. వీరిలో 35 శాతం మంది మహిళలు. అంటే 13,500 మంది ఆడవాళ్ళ . వీరిలోనూ తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వారు పెద్ద సంఖ్యలోనే ఉంటారు. ఇక ఏపీకి చెందిన మహిళా ప్రయాణీకల సంఖ్య సగటున ఒక ట్రిప్పుకు 6 మంది చొప్పున ఉంటారని అంచనా. ఆ లెక్కన రోజుకు సుమారు 7 వేల మంది ఏపీ మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. నెలకు 2.10 లక్షల మంది, ఏడాదికి 23 లక్షల మంది వంతున కొండకు వెళ్ళి వస్తున్నట్టు ఆర్టీసీ అంచనాలు చెబుతున్నాయి. అయితే వీరిలో భక్తులే కాకుండా టీటీడీలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులు, చిరు వ్యాపారులు, కూలీలు సైతం వున్నారు.

రూ.180 మిగులుతుంది

తిరుపతి-తిరుమల నడుమ దూరం 24 కిలోమీటర్లు. ఆర్టీసీ డీజిల్ బస్సుల్లో చార్జీ ఒక వైపునకు రూ.90లు. అంటే ఒక మహిళకు తిరుమలకు వెళ్లిరావడానికి 180 రూపాయలు ఖర్చవుతుంది. దీన్ని ఉచితం చేయడం వల్ల కుటుంబాలతో తిరుమల కొండకు వచ్చేవారికి ఎంతో ఉపశమనం కలుగుతుంది. అయితే తిరుమలకు ఉచితం చేస్తే ఆర్టీసీ మీద పడే భారం ఏడాదికి రూ. 23 కోట్లు. ఉచిత ప్రయాణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ. 1960 కోట్ల ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధపడింది. ఈ 23 కోట్లు మోయలేనంత భారం కాదు. భక్తుల్లో సంతోషం నింపడానికి ఇది కారణం అవుతుంది. ఇవన్నీ పరిశీలించిన తర్వాతే ప్రభుత్వం ఉచిత నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.







నెల తర్వాత అందుబాటులోకి స్వామి పుష్కరిణి

తిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామి పుష్కరిణి మరమ్మతు పనులు పూర్తిచేసుకుని బుధవారం నుంచి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఏటా బ్రహ్మోత్సవాల ముందు శ్రీవారి పుష్కరిణిని మరమ్మతులను చేయడం పరిపాటి. ఈక్రమంలో జూలై 20వ తేదీన పుష్కరిణిలో మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. పాత నీటిని తొలగించి అడుగుభాగంలో పేరుకుపోయిన ఇసుక, పాచి తొలగించారు. మెట్లకు రంగులు వేశారు. దాదాపు కోటి లీటర్ల నీటితో పుష్కరిణిని నింపి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మరమ్మతుల సందర్భంగా నెల పాటు నిలిపేసిన పుష్కరిణి హారతిని తిరిగి ప్రారంభించడంతో పాటు భక్తులనూ పుష్కరిణిలోకి అనుమతించారు.

మార్గదర్శిగా కమిషనర్

- 7 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మౌర్య



బంగారు కుటుంబాలతో కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఏడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా తిరుపతి నగరపాలక సంస్థ కమిషనరు ఎన్.మౌర్య 'మార్గదర్శి'గా మారారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం కింద నగరంలో పేదరికం నిర్మూలనకు ఆమె ముందుకొచ్చారు. ఆ బంగారు కుటుంబాల సభ్యులు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాల్లో పునాదులు ఏర్పడేందుకు, అవసరమైన మౌలిక సదుపాయాలను అందిస్తామని కమిషనరు హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు లేని చిన్నారికి, తండ్రి లేని ఇద్దరు పిల్లలకు, తండ్రి లేని మరో బాలికకు విద్యను అందిస్తానని హామీ ఇచ్చారు. ఓ కుటుంబానికి ఇల్లు ఇప్పిస్తానని, జీవనోపాధి కోసం ఒకరికి తోపుడు బండి, కిరాణా షాపు పెట్టుకునేందుకు ఆర్థికంగా సాయం అందించేందుకు మౌర్య అంగీకరించారు. నగరంలోని పేదలకు (బంగారు కుటుంబాలు) ఏదో విధంగా సాయం చేసేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

- అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం
- శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే, కలెక్టర్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు


రేణిగుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయ సమీపం ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ డిజిటల్ టెక్నాలజీస్ భవనంలో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సోక్స్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. అమరావతి నుంచి సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం వర్చువల్‌గా ప్రారంభించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్వీయూ వీసీ అప్పారావు, జేసీ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీతో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఇక్కడి సోక్స్ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరిలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. యువ పారిశ్రామికులకు, స్టార్టప్ పెట్టాలనుకునే వారికి, మంచి ఆలోచనలుండి మార్గదర్శకత కోసం వేచిచూస్తున్న వారికి రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ గొప్ప అవకాశంగా మారుతుందన్నారు. గడిచిన 24 గంటల్లో 1600 మంది యువకులు తమ కంపెనీలు ప్రారంభించేందుకు రిజిస్టర్ చేసుకున్నారన్నారు. హబ్ అమరావతిలో ఉంటుందని, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, తిరుపతిలో ఐదు సోక్స్ కేంద్రాలు ఏర్పాటు చేశారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి కేంద్రానికి లీడ్ అదానితో పాటు నవయుగ, అమర్ రాజా లీడ్ పార్టనర్లుగాను, ఐఐటీ నాలెడ్జ్ పార్టనర్‌గా ఉందన్నారు. ఇది ప్రభుత్వ, కార్పొరేట్, అకడమిక్ రంగాల సమ్మేళనమన్నారు. అందరూ కలిస్తేనే ఇన్నోవేషన్ సాధ్యమని చెప్పారు. అకడమిక్‌పరంగా యూనివర్సిటీలు.. ఇండస్ట్రీ పరంగా చూస్తే శ్రీసిటీ, మేనకూరు సెజ్ ఉండగా, రౌతుసూరమాల వస్తున్నదన్నారు. క్రిస్ సిటీ, రేణిగుంట విమానాశ్రయం వద్ద ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్-1, 2 ఉన్నాయన్నారు. జిల్లాలో మంచి ఇండస్ట్రీ వాతావరణం ఉందని, ఎవరైనా ఎంటర్‌ప్రెన్యూర్ కావడానికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. తిరుపతితో పాటు చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలవారూ ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మత్స్యశాఖ, సెన్సార్ సింక్ ఇన్నోవేషన్, కేతన టెక్ బీస్, ఆటో కంపోసైట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోక్స్ లింక్, కార్బన్ సెల్స్, మనోడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, పైపర్ పిక్సెల్ రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్, మైండ్ ట్రానిక్స్ జుమాంజి బాక్స్, రోబో మాక్ ఎస్టీఈఎస్ వాటర్ సొల్యూషన్స్, కోకో మంత్రా, ఎనర్జీ ఎఫిషియన్ అండ్ ఎన్విరాన్మెంట్ ఫ్రెండ్లీ ఫోరం, ఏఈడీపీఏ ఎక్విప్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, పలియో జ్యూస్ సంస్థల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, ఎస్వీయూ కల్చరల్ కోఆర్డినేటర్ వివేక్ చౌదరి, ప్రజాప్రతినిధులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులు పాల్గొన్నారు.



స్టాల్‌లో ఏర్పాటు చేసిన డ్రోన్‌ను పరిశీలిస్తూ..

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

భాకరాపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ నగరి సిరిగలవారిపల్లె గ్రామ పరిసరాల్లో ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేస్తున్నది. మంగళవారం రాత్రి గుడ్లూరు బండ ప్రాంతంలో సంచరిస్తూ సిరిగలవారిపలెలో పి.సుధాకర్‌కు చెందిన వరి, మిరప పంటలు, వై.మురళికి చెందిన టమోటా, వరి పంటలను ధ్వంసం చేసింది. అటవీ సరిహద్దు ప్రాంతంలో రైతులు పంట పొలాల దగ్గరకు వెళ్లడానికి భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఒంటరి ఏనుగును తలకోన అడవిలోకి మళ్లించాలని రైతులు కోరుతున్నారు.



నగరి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

- సెప్టెంబరు మొదటివారంలోపు..

బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయండి

- అధికారులను ఆదేశించిన టీటీడీ ఈవో

తిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల మొదటి వారంలోపు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేది వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ హర్షవర్ధనరాజు, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి మాడవీధుల్లో తిరిగారు. గ్యాలరీల నుంచి భక్తులు ఇబ్బంది పడకుండా వాహనసేవలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సెప్టెంబరు మొదటి వారంలోపు ఇంజినీరింగ్ పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు సీఎం చంద్రబాబు ప్రభుత్వం తరుపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. మాడవీధుల్లో అదనపు మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు అవసరమైన పారిశుధ్య సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ ఏడాది అదనపు ట్రిప్పుల కోసం ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. ముందస్తుగా పార్కింగ్ ప్రణాళికలు రూపొందించామని వివరించారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, డిప్యూటీఈవో లోకనాథం, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాడవీధిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో తదితరులు

118 అంగన్వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్!

- పదో తరగతి ఉత్తీర్ణులైన కార్యకర్తలకు పదోన్నతి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చింది. ఆ మేరకు అంగన్వాడీ మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో జిల్లాకు సంబంధించి 118 వరకున్నాయి. జిల్లాలో 2,492 అంగన్వాడీ కేంద్రాలుండగా, అందులో 361 మినీ అంగన్వాడీ సెంటర్లు. ఈ మినీ అంగన్వాడీ కేంద్రాల్లో దాదాపు 118 మెయిన్‌గా అప్‌గ్రేడ్ కానున్నాయి. వీటిలో పనిచేస్తున్న(పదవతరగతి ఉత్తీర్ణులై) కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఇప్పటి వరకు వీరికి నెలకు రూ.7వేలు గౌరవ వేతనం వచ్చేది. పదోన్నతి లభించడంతో ఆ గౌరవవేతనం రూ.11,500 కు పెరగనుంది. ఈ ఉత్తర్వులపై అంగన్వాడీల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 118 సెంటర్ల వరకు అప్‌గ్రేడ్ కానున్నట్లు ఐసీడీఎస్ పీడీ వసంతభాయ్ తెలిపారు. కాగా, మిగిలిన అంగన్వాడీ కేంద్రాలలో పది మందికంటే తక్కువ పిల్లలుండే వాటిని.. కిలోమీటరు పరిధిలోని మరో అంగన్వాడీ కేంద్రంలో విలీనం చేయనున్నారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలుశిక్ష

- రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ముగ్గురు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం ఎర్రచందనం రాష్ట్ర కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన పి. మురుగన్, ఎస్.సురేష్, ఎం.చిన్నపయన్ 2017లో నాగపట్ల ఈస్ట్ బీట్ చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. దాదాపు ఎనిమిదేళ్ల పాటు కేసు విచారణ సాగింది. తాజాగా బుధవారం నేరం రుజువు కావడంతో వీరికి ఐదేళ్ల పాటు జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ముగిసిన విశ్వశాంతి మహాయాగం





తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన సంగోపాంగ శ్రీశ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. 32 మంది వేదపండితుల సమక్షంలో వైదిక క్రతువులు జరిగాయి. ఈ యాగానికి హాజరైన ఈవో శ్యామల రావు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టీటీడీ నిర్ణయం తీసుకుందన్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివ సుబ్రహ్మణ్యం అవధాని పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం వద్ద జస్టిస్ సంజయ్ కరోల్

తిరుచానూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని బుధవారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆయనను ఆలయ వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.5.30 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,033

తలనీలాలు సమర్పించినవారు: 26,905

స్విమ్స్‌లో పులివెందుల పెత్తనానికి ఈసారైనా బ్రేక్ పడేనా?

- **మెడికల్ మాఫియాకి యంత్రాంగం అండ**
- **మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాని వైనం**
- **నేడు నాలుగోసారి తెరవనున్న టెండరు**



శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద మెడికల్ షాపు

పులివెందుల పెత్తనం నుంచి స్విమ్స్ ఇప్పటికీ బయటపడడంలేదు. కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా వారి హవా కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ అధీనంలోకి స్విమ్స్ వచ్చీ రాగానే రాజకీయ పెత్తనం పెరిగిపోయింది. జనరిక్ (జన ఔషధి)మెడికల్ షాపులు పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరొక మెడికల్ షాపులను కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాపులను రద్దుచేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఎట్టకేలకు ఒక షాపును రద్దుచేయగలిగారు. అయితే స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద పులివెందులకు చెందిన వ్యక్తుల చేతిలో ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోతున్నారు. కేవలం రూ.17వేల నామమాత్రపు అద్దెతోనే దీనిని కేటాయించారు. ప్రస్తుతం రూ.60వేలకు పెంచారు. దాదాపు నెలకు రూ.15లక్షలకు పైగా అద్దెవచ్చే అవకాశం ఉన్న షాపును నామమాత్రపు అద్దెతో కేటాయించడంపై మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం టీటీడీ మూడు సార్లు టెండర్లు పిలిచింది. కానీ, టెండరులో పాల్గొనేందుకు ఎవరూ ముందుకురాలేదు. రూ.25లక్షల అద్దెతో పాటు రూ.25కోట్ల టర్నోవర్ ఉండాలని అసాధారణ నిబంధనలు పెట్టడంవల్లే ఎవరూ ముందుకు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. పులివెందులకు చెందిన వైసీపీ బ్యాచ్‌కు అనుకూలంగా కొందరు అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా అసాధారణ అంశాలు చేర్చడం వలనే టెండర్లలో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడంలేదని టీడీడీ ఆలస్యంగా గ్రహించింది. ఈక్రమంలో టర్నోవర్‌ను మాత్రం రూ.25కోట్లు ఉంచి నెలవారి అద్దెను రూ.25లక్షల నుంచి రూ.15లక్షలకు తగ్గిస్తూ గతనెల 25వ తేదీ టీటీడీ నాలుగోసారి టెండరు నోటిఫికేషన్ ఆహ్వానించింది. నెలకు రూ.15లక్షల అద్దెతో టెండర్లలో పాల్గొనేందుకు ఆసక్తిచూపుతున్నారు కానీ రూ.25కోట్ల టర్నోవర్ నిబంధన అడ్డుగామారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తిరుపతిలో రెండు, మూడు రిటైల్ షాపులు మినహా తక్కిన షాపులవారికి రూ.25కోట్ల టర్నోవర్ ఉండడం అసాధ్యం. అందుకే తెలంగాణనుంచి పలువురు టెండర్లలో పాల్గొన్నట్టు తెలిసింది. కాగా బుధవారం టెండర్లు తెరవాల్సివుండగా గురువారానికి వాయిదా వేస్తున్నట్టు టీటీడీ రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఈసారైనా టెండరు విజయవంతమవుతుందో లేదో వేచిచూడాలి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వచ్చేనెలలో బీవీఎస్సీ తరగతులు ప్రారంభం

తిరుపతి రూరల్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీ పరిధిలో యూజీ(బీవీఎస్సీ) కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి కళాశాలల్లో ఏపీ ఈఏపీసెట్ ర్యాంకు ప్రాతిపదికన అడ్మిషన్లు చేపడుతున్నారు. ఈఏపీసెట్ ద్వారా 85శాతం, వీసీఐ కోటా కింద(నీట్ ర్యాంకు ఆధారంగా)15శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. రైతు కోటా ద్వారా 25శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. స్థానికతకు సంబంధించి న్యాయస్థానంలో తీర్పు వెలువడిన నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలన ఈవారంలో పూర్తికానుందని వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య తెలిపారు. కోర్సులో చేరేందుకు దాదాపు 6వేలమంది దరఖాస్తు చేశారు.

ఎన్నారై కోటాకు ప్రతిపాదన

వర్సిటీలో 13ఏళ్ల కిందట ఎన్నారై కోటా రద్దయింది. బోర్డు ఆదేశాల మేరకు ఈ కోటా పునరుద్ధరణకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు పంపారు. తాద్వారా వర్సిటీలో 45సీట్లకు అవకాశముంటుంది. ప్రభుత్వం అనుమతిస్తే ఈసీట్ల ద్వారా ఏడాదికి దాదాపు రూ.కోటి వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. కాగా ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ఒక్కో కళాశాలలో 70సీట్లు ఉన్నాయి. ఐదున్నరేళ్లలో నాలుగున్నరేళ్లు కళాశాలలో విద్యాబోధన సాగుతుంది. ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ పీరియడ్‌లో క్షేత్రస్థాయిలో పశువైద్య ఆసుపత్రుల్లో పనిచేయాలి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండు



ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య

బీవీఎస్సీ కోర్సులు చదివిన వారికి వివిధరంగాలలో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పశుసంవర్ధకశాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్), పౌల్ట్రీ, డెయిరీ, ఫార్మాస్యూటికల్ సంస్థల్లో అవకాశాలు ఉన్నాయి. ప్రైవేట్ ప్రాక్టీస్ ద్వారా ఉపాధి. ఆలిండియా స్థాయిలో వెటర్నరీ ఫ్యాకల్టీగా పనిచేయొచ్చు. ప్రత్యేకించి విదేశాలల్లో వెటర్నేరియన్స్‌కి డిమాండ్ ఉంది. ప్రతిష్టాత్మక యూపీఎస్సీ, ఏపీపీఎస్సీలలో రాణించేందుకు వెటర్నరీవిద్య దోహదం చేస్తుంది.

- డాక్టర్ వీరబ్రహ్మయ్య, వెటర్నరీ డీన్

55 ఏళ్ల భూవివాదానికి పరిష్కారం

- **అటవీశాఖకు భూములు తిరిగి అప్పగింత**
- **బాధిత రైతులకు మరోచోట పట్టాలిచ్చేందుకు ఒప్పందం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఇనగలూరు రెవెన్యూ పరిధిలోని సింహాచలకండ్రిగ, గొల్లపల్లి పంచాయతీల్లో 55 ఏళ్ల అటవీ భూముల వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. అక్కడి రైతులతో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారులు, సింహాచలకండ్రిగ రైతులతో బుధవారం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. చర్చల వివరాలను విలేకరుల సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. 1970లో అప్పటి ప్రభుత్వం 130 ఎకరాలకు సంబంధించి రైతులకు పట్టాలు పంపిణీ చేసిందన్నారు. అయితే ఈ భూమి రిజర్వు ఫారెస్టు కావడంతో 1978లో అప్పటి కలెక్టర్ రద్దు చేశారన్నారు. తరువాత 1998లో 98 కుటుంబాలకు 130 ఎకరాల భూమి పంపిణీ చేస్తూ పట్టాలు జారీచేశారన్నారు. 2008లో అటవీశాఖ అధికారులు మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈక్రమంలో 2014లో న్యాయస్థానం ఈ భూములను అటవీశాఖవిగా గుర్తించి పట్టాలను రద్దు చేసినట్లు వివరించారు. ఇలా 55 ఏళ్లుగా అటవీశాఖ, సింహాచలకండ్రిగ గ్రామస్థుల మధ్య వివాదం నలుగుతూనే ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజ్ఞప్తితో తాను వచ్చి రెవెన్యూ, అటవీశాఖ, రైతుల సమక్షంలో చర్చించినట్లు తెలిపారు. అటవీ భూములను తిరిగి ఆ శాఖకు అప్పగించి బాధిత రైతులకు సమీప ప్రాంతంలో సాగుకు అనువైన భూములను కేటాయిస్తామన్నారు. వీటికి పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అటవీశాఖ స్వాధీనం చేసుకుంటున్న భూమిలో నీలగిరి తైలం మొక్కలను పెంచి వనసంరక్షణ కమిటీ ఏర్పాటు ద్వారా రైతులకు ప్రతి మూడు, నాలుగేళ్లకోసారి రూ.20వేల నుంచి రూ.50వేల వరకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ నిర్ణయాలకు రైతులు అంగీకరించి హర్షం వ్యక్తం చేశారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సింహాచలకండ్రిగతో పాటు బీవీపురం, గొల్లపల్లి గ్రామాల్లో నెలకొన్న 1,150 ఎకరాలకు సంబంధించి భూవివాదాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

- **ఈ నెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహణ**
- **శాప్ ఛైర్మన్ రవినాయుడు**

తిరుపతి (క్రీడలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో "అమరావతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29వ తేదీన విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తారని రవినాయుడు స్పష్టం చేశారు.



పేకాట ఆడుతున్న జూదరులు

డ్రోన్‌కు చిక్కిన జూదరులు

- **11మంది అరెస్టు.. 9 మంది పరారీ**
- **రూ.2,36,740, 12సెల్‌ఫోన్లు, 4 బైక్‌లు స్వాధీనం**

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కింద పట్ట పరిచారు. ఒక పక్క పరదా కట్టారు. ఇలా రోడ్డుకు దూరంగా పొలాల్లో పేకాట స్థావరం పెట్టారు. ఎక్కడో పొలాల్లో ఉన్న తమను ఎవరు పట్టుకుంటారులే అని ధీమాగా పేకాట ఆడుతున్న వారు.. ఆకాశం నుంచి నిఘా పెట్టిన డ్రోన్‌కు చిక్కారు. ఏర్పేడు మండలం మేర్లపాక, బండారుపల్లి, ముసలిపేడు, కందాడు, రామలింగాపురం గ్రామాల్లో డ్రోన్ ద్వారా పోలీసు బీట్ పెట్టారు. సైబర్ క్రైం సీఐ, డ్రోన్ కెమెరాల ఇన్‌ఛార్జి వినోద్‌కుమార్ పర్యవేక్షణలో పది మంది పోలీసులు పేకాట స్థావరాలపై డ్రోన్ నిఘా పెట్టారు. బండారుపల్లి, ముసలిపేడు సరిహద్దు పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పేకాట ఆడుతున్న మూడు ప్రాంతాలపై దాడులు నిర్వహించి 11మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో 9మంది పరారయ్యారు. పేకాట స్థావరాల నుంచి రూ.2,36,740 నగదు, 12 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో తిరుపతికి చెందిన ఇద్దరు, కడపకు చెందిన ఐదుగురు, అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన ఇద్దరు, కోడూరుకు చెందిన ఒకరు, కలకడకు చెందిన ఒకరు చొప్పున ఉన్నారు. వీరిని ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

డిసెంబరులోగా కొత్త భవనం అప్పగించండి

- రైల్వే జీఎం సంజయ్ కుమార్ ఆదేశం



రైల్వేస్టేషన్ భవన నిర్మాణాలను పరిశీలించి సూచనలిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని ఈ ఏడాది డిసెంబరులో అప్పగించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రైల్వేస్టేషన్‌లో చేపట్టిన నిర్మాణాల ప్రణాళికను పవర్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. అనంతరం అధికారులతో సమీక్షించాక సాధారణ ప్రయాణికుల విశ్రాంతి గదుల్లో సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను అప్పగించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా, జోనల్ సీఈ సూర్యనారాయణ, కార్యదర్శి మల్లాడి శ్రీనివాస్, సీనియర్ స్కేల్ అధికారులు సుదర్శన్‌రెడ్డి, మనికంఠ, మనోజ్, శ్రావణ్ కుమార్, సూర్యనారాయణ, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా జీఎంను రాజస్థానీ బ్రాహ్మణ్ మహాసభ నాయకులు కలిశారు. తిరుపతి-బికనీర్‌ల మధ్య రెగ్యూలర్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని రైల్వే కూలీలు వినతి పత్రం సమర్పించారు. డీఆర్ఎంతో జీఎం మాట్లాడి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయనకు స్టేషన్ అభివృద్ధి పనుల గురించి అధికారులు వివరించారు. అనంతరం ఆయన ప్రత్యేక కోచ్‌లో సికింద్రాబాద్ బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ఉదయం రైల్వేజీఎం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సులు ఫుల్

- **ఫుట్‌పాత్ మీద ప్రమాదం అంచున ప్రయాణాలు**



బస్సు వెలుపల రద్దీ



బస్సులోపల రద్దీ

పుత్తూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంతో పల్లెవెలుగు బస్సులన్నీ లోపల బయటా నిండిపోతున్నాయి. ఫుట్‌పాత్ ప్రయాణంతో ప్రమాదం అంచున నడుస్తున్నాయి. ప్రత్యేకించి కళాశాలలు, కార్యాలయాల ముగింపు వేళల్లో అదుపు చేయలేని రద్దీతో బస్సులు కదులుతున్నాయి. సత్యవేడు, నగరి, చిత్తూరు మార్గాల్లో గతంలో ఆటోల్లో వెళ్లే మహిళలు ఇప్పుడు ఓపికతో వేచి వుండి పల్లెవెలుగు బస్సులు ఎక్కుతున్నారు. రోజురోజుకూ ఆక్యుపెన్సీ రేటు పెరుగుతోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా రూట్లలో అదనపు సర్వీసులను నడపాలని మహిళలు కోరుతున్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



బోడేవాండ్ల పల్లెవద్ద పట్టుబడిన వాహనాలతో పాటు ఎర్రచందనం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బోడేవాండ్లపల్లెవద్ద ఎర్రచందనం స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా.. బోడేవాండ్లపల్లెవద్ద టీ జంక్షన్ వద్ద బుధవారం వేకువజామున ఓ ద్విచక్ర వాహనం, దాని వెనుక వ్యాను అతివేగంగా వెళ్లడం ఫారెస్ట్ సిబ్బంది గమనించారు. వెంటనే నిలువరించేందుకు వేగంగా వెంబడించారు. దీంతో నిందితులు తమ వాహనాలను రోడ్డుపై నిలిపి పరారయ్యారు. సిబ్బంది వాహనాలను పరిశీలించగా 395 కేజీల బరువు గల 10 ఎర్రచందనం దుంగలున్నాయి. వాహనాలతో దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

'పుష్పిత్ స్టీల్స్'లో కార్మికుడి మృతి

- **కర్మాగారం ఎదుట మృతుడి బంధువుల ధర్నా**



పరిశ్రమ వద్ద బంధువుల ధర్నా



మహేష్ ఫైల్ ఫొటో

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీలోని 'పుష్పిత్ స్టీల్స్'లో మెకానిక్‌గా పనిచేస్తున్న మేర్లపాకవాసి మహేష్(45) బుధవారం మృతిచెందారు. విధినిర్వహణలో ఉన్న ఆయన సొమ్మసిల్లి పడిపోవడంతో హుటాహుటిన కంపెనీ వాహనంలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు యాజమాన్యం తెలిపింది. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, తీవ్ర పని ఒత్తిడి వల్లే కర్మాగారం లోపలే మహేష్ చనిపోయాడని, బతికి ఉన్నట్లు ఆస్పత్రికి తీసుకెళ్లి యాజమాన్యం నాటకాలు ఆడారని ఆయన బంధువులు ఆరోపిస్తున్నారు. కర్మాగారంలోని పెద్ద కీలన్‌పైకి బలవంతంగా ఎక్కించారని, అక్కడ ఆయన చనిపోయినట్లు వారు చెబుతున్నారు. ఈ క్రమంలో న్యాయం కావాలని, మహేష్ మృతికి కారణమైన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మృతదేహంతో పుష్పిత్ స్టీల్స్ ఎదుట బంధువులు, గ్రామస్థులు ధర్నా చేశారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి భద్రత కల్పించాలని కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మన్ భాషపై శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ అభ్యర్థులకు శుక్రవారం నుంచి జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఈ శిక్షణ ఉంటుందని ఎస్సీ సంక్షేమ శాఖ సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉచిత వసతితోపాటు శిక్షణ ఇస్తారని వివరించారు. ప్రారంభ కార్యక్రమంలో మంత్రి బాలా వీరాంజనేయస్వామి పాల్గొంటారన్నారు.

విద్యుత్ స్తంభాలకు అనధికార కేబుల్స్ తొలగించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంతోపాటు టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ స్థంభాలకు అనధికారంగా వున్న కేబుల్ వైర్లను తొలగించాలని లేదంటే తమ సిబ్బంది శనివారం నుంచి తొలగిస్తారని సదరన్ డిస్కం ఈఈ వి.చంద్రశేఖర్ రావు బుధవారం స్పష్టంచేశారు. విద్యుత్ స్తంభాలకు ఇబ్బడి ముబ్బడిగా అనధికార కేబుల్ వైర్లు ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు మార్లు కేబుల్ ఆపరేటర్లుకు వైర్లు తొలగించాలని కోరామన్నారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటానికి కఠినమైన నిర్ణయాలు తీసుకొంటున్నామని వెల్లడించారు. వినాయకచవితి మండపాల నిర్వాహకులు రుసుం చెల్లించి తాత్కాలిక విద్యుత్ సర్వీసులను పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఈపీతో సత్వర అభివృద్ధి

- హెచ్‌సీయూ మాజీ వీసీ పొదిలి అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 అమలుతో దేశం సత్వర అభివృద్ధి సాధిస్తుందని హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు పేర్కొన్నారు. ఐదేళ్ల ఎన్ఈపీ అమలు - ప్రగతి అంశంపై అఖిల భారతీయ శిక్షక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనెట్ హాల్లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 37 ఏళ్లుగా దేశ విద్యా విధానంలో ఎలాంటి మార్పులూ తీసుకురాలేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెరిగిన నేపథ్యంలో మార్పులు అవసరమని కేంద్ర ప్రభుత్వం భావించిందన్నారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ఐటీ, ఫార్మా, అగ్రి, డెయిరీ వంటి రంగాల్లో స్వయం ఉపాధిని కల్పించేలా అనేక నూతన కోర్సులు ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ దేశంలో కేజీ నుంచీ పీజీ దాకా ఎన్ఈపీ పటిష్టంగా అమలు అవుతుందన్నారు.తద్వారా విద్యా రంగంలో మంచి ఫలితాలు సాధించినట్టు తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షుడు గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ దేశాల్లో ప్రాథమిక దశ నుంచి ఉన్నత విద్య వరకూ అంతా మాతృభాషలోనే విద్య అందిస్తున్నారని,మన దేశంలోనూ ఇదే తరహా బోధన అందించే అవకాశాన్ని ఎన్ఈపీ కల్పించిందని అన్నారు. విద్యకు బడ్జెట్‌లో 6 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు వాణి, విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- డెప్యుటేషన్‌పై వెటర్నరీ వర్సిటీకి

వెంకటగిరి పశువైద్య ఏడీ బదిలీ

తిరుపతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎంవీ స్వామిబాబు డెప్యుటేషన్‌పై తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి బదిలీ అయ్యారు. ఇక్కడ ఏడాదిపాటు ఆయన కొనసాగనున్నారు. వర్సిటీ పరిధిలోని సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ వెటర్నరీ ఎడ్యుకేషన్‌లో గానీ లేదా తిరుపతిలోని వర్సిటీ ప్రధాన కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా గానీ ఆయన సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం వర్సిటీ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

మరో 24 మందికి టీడీఆర్ బాండ్లు

తిరుపతి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 24 మందికి టీడీఆర్ బాండ్లను బుధవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అందజేశారు. నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేశామని తెలిపారు. పలుమార్లు టీడీఆర్ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 267 మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామన్నారు. కాగా బుధవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు అన్ని పత్రాలను పరిశీలించి ఎంపిక చేశామని అన్నారు. డీసీపీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్ రెడ్డి, పక్కన ఎంపీడీవో మురళీకృష్ణ, తహసీల్దార్ గోపినాథరెడ్డి

సూళ్లూరుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముందుగానే వర్షాలు పడడంతో వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యయసాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మురళీకృష్ణ, తహసీల్దార్ గోపినాథరెడ్డి, సీడీపీవో జ్యోతి కిరణ్, వైద్యాధికారిణి జయశ్రీ, గృహ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సత్యనారాయణ, భవాని తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం



రైల్వేస్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం మోహిత్

గూడూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు రైల్వేస్టేషన్‌ను విజయవాడ డీఆర్‌ఎం మోహిత్ బుధవారం పరిశీలించారు. ప్లాట్‌ఫామ్‌లు, పడమర వైపు టిక్కెట్ బుకింగ్ కేంద్రాన్ని, ప్రమాణికుల నిరీక్షణ గదులను తనిఖీ చేశారు. అనంతరం రైల్వేట్రాక్‌ను పరిశీలిస్తూ గూడూరు నుంచి కృష్ణపట్నం వెళ్లారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

జాతరలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు



పోలేరమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతా కుమారి

వెంకటగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) వెంకటగిరి పట్టణంలో వచ్చేనెల 10, 11 తేదీల్లో నిర్వహించే గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు గూడూరు డీఎస్పీ గీతా కుమారి తెలిపారు. బుధవారం ఆమె పోలరమ్మను దర్శించుకొన్నారు. అనంతరం జాతర నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. మల్లమ్మ గుడి వద్ద అమ్మవారి విరూప కార్యక్రమం గురించి తెలుకొని పోలీసు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట సీఐ రమణ, ఎస్‌ఐ ఏడుకొండలు, ఇంజనీర్ బాబు, గొల్లగుంట రాము తదితరులు ఉన్నారు.

కలిమిలి రాజ్యలక్ష్మి సేవలు చిరస్మరణీయం

డక్కిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కలిమిలి రాజ్యలక్ష్మి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. డక్కిలి జడ్పీటీసీగా ఉంటూ ఇటీవల కలిమిలి రాజ్యలక్ష్మి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె భర్త కలిమలి రాంప్రసాద్ రెడ్డిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ గంగోటి నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. రాజ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. వారి వెంట టీడీపీ నాయకులు పుల్లికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, శివారెడ్డి, బాబు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, పప్పు చంద్రమౌళిరెడ్డి, తదితరులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తలకు నివాళి



కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నేతలు

కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దాలి గ్రావనికిఇ చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కాకాణి రమణయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ బుధవారం నివాళులర్పించారు. అలాగే చెందోడులో బూత్ కమిటీ కన్వీనర్ ధనంజయ తల్లి కాంతమ్మ మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, వాకాడు ఏఎంసీ ఛైర్మన్ మర్రి ప్రమీల, టీడీపీ జిల్లా కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, మస్తాన్‌బాషా, మనోజ్‌రెడ్డి, దారా సురేష్, జితేంద్రరెడ్డి, పోలయ్య, రఘునాథరెడ్డి, చల్లా సురేష్, సుధాకరరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని జీలపాటూరు, నెలబల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి పథకం కింద మొక్కలు, పశుగ్రాస పెంపకం పనులు కూడా అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.



జీలపాటూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ ప్రేమ్‌కుమార్

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు బాలికల ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, మెకానిక్ డీజల్, వెల్డర్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకుని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు 8498066674 నెంబరును సంప్రదించాలన్నారు.

బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో మూడు బార్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ కోరారు. బుధవారం నాయుడుపేట, సూళ్లూరుపే ఎక్సైజ్ కార్యాలయాల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. సూళ్లూరుపేటలో రెండు, నాయుడుపేటలో ఒక బార్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ లోగా ఆన్‌లైన్, డీపీఈవో కార్యాలయం, ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణేష్ ప్రతిమలు - తదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు

చవితి ఉత్సవాలకు ముస్తాబవుతున్న గణనాథులు

సూళ్లూరుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జై బోలో గణేష్ మహరాజ్‌కీ.. జై అని అనేందుకు ఇంకా ఎన్నో రోజులు లేవు. వినాయక చవితి పండగ సమీపిస్తుండటంతో కళాకారులు ప్రతిమల తయారీని వేగవంతం చేశారు. విగ్రహాలను రూపొందించి తుది మెరుగులు దిద్దుతున్నారు. రెండు అడుగుల ఎత్తు మొదలుకొని తొమ్మిది అడుగుల ఎత్తు వరకు లంబోదరుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. కొన్ని రోజుల ముందే కొంత నగదు అడ్వాన్స్ ఇచ్చి తమకు నచ్చిన ఆకృతిలో విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు సూళ్లూరుపేటలో జాతీయ రహదారి పక్కన గోదాముల్లో వివిధ రూపాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈనెల 27న వినాయక చవితి పండగను పురష్కరించుకొని ఇప్పటి నుంచే ఉత్సవ కమిటీలు విగ్రహాల తయారీ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సహకార సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌ఎల్‌ఆర్ కల్యాణ మండపంలో డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండల్లాలోని సింగిల్ విండోల అధ్యక్షులుగా పప్పు చంద్రమౌళిరెడ్డి, గొల్లగుంట వెంకటముని, గుత్తికొంట బాబు నాయుడు, పులి జనార్దనరెడ్డి, ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, చైతన్య ప్రసాద్‌రెడ్డి, నర్రావుల భాస్కర్‌నాయుడు, రంగినేని మునిరాజా, రాయి సత్యం, దాసరి ప్రభాకర్‌నాయుడు, సింగంశట్టి భాస్కర్‌రావు, ఆది వెంకటకృష్ణారెడ్డి సాముహికంగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారని నడిపిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలను దోచుకున్నారని ఆరోపించారు. సంఘాలు ద్వారా సకాలంలో రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు తెచ్చుకొని ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఇక అలా జరగడానికి వీల్లేకుండా సహకార సంఘాలు సకాలంలో రుణాలు అందజేయాలని సూచించారు. రైతులు కూడా తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ 2014-19లో తాను ఛైర్మన్‌గా పనిచేసినప్పుడు సెంట్రల్ బ్యాంకును లాభాలబాటలో పెట్టడం జరిగిందన్నారు. అలాగే రైతులకు వెయ్యి కోట్ల రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని 15 సొసైటీలకు రూ.200 కోట్లు రుణం కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో నెల్లూరు డీసీఎంఎస్ ఛైర్మన్ గంగోటి నాగేశ్వరరావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు జన్ని రమణయ్య, బీజేపీ కన్వీనర్ ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, ఏఎంసీ ఛైర్మన్ పునగోటి విద్వనాథ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పులికొల్లు రాజేశ్వరరావు, గొల్లగుంట మురళీకృష్ణ, బీరం రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయానికి భూమిపూజ

కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి బుధవారం స్థానిక నాగశక్తి పీఠాధిపతి చిదానందస్వామి భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకువచ్చి విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజారత్నం, సుధాకర్, రమణయ్య, మోహన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో నేడు కలెక్టర్ పర్యటన

వాకాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం వాకాడు మండలంలో పర్యటించనున్నారని డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ తెలిపారు. వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బాలిరెడ్డిపాళెం వద్ద ఉన్న స్వర్ణముఖి పొర్లుకట్టలను పరిశీలిస్తారని డీటీ చెప్పారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి

వాకాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ అన్నారు. మండలంలోని రేషన్ డీలర్లతో బుధవారం ఏర్పాటు చేశారు. ప్రతి నెలా 1నుంచి 15వ తేదీ వరకు డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తూకాల్లో మోసం చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

వినాయక ఉత్సవాల అనుమతికి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోండి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల అనుమతి కోసం పోలీస్‌శాఖ ప్రత్యేకంగా జీఏఎన్‌ఈఎస్‌హెచ్‌యూటిఎస్‌ఎవి డాట్‌నెట్ పేరుతో వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఉత్సవాల నిర్వాహకులు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్‌విండో విధానంలో అనుమతి పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీచేసి నిరభ్యంతర పత్రాన్ని జారీ చేయడం జరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే మండపాలకు మాత్రమే ఈ అనుమతులు పొందాలని తెలిపారు.

పంచాయతీల ఆడిట్

కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని 21 పంచాయతీలకు సంబంధించి ఆడిట్ జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగం, పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

కృష్ణాష్టమి వేడుకలు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో బుధవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు ఇస్కాన్ సిటీ సుఖదేవ్ మహర్షి బలీంద్ర బాబు, వర్మప్రభు, చక్రధర్‌బాబు, వర్మప్రభు, కామేశ్వరి, జ్యోతి, సునీత, వేమసాని భారతి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ఉట్లోత్సవం
తిరుమాడ వీధుల్లో గోవిందరాజ స్వామి విహారం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో బుధవారం ఉట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. గోకులాష్టమి అయిన మూడో రోజు చిన్నవీధి, నాలుగో రోజు పెద్దవీధి ఉట్లోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం పెద్దవీధి ఉట్లోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో గోవిందరాజస్వామి, శ్రీకృష్ణుని ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం చప్పరంపై గోవిందరాజస్వామిని, పల్లకిలో శ్రీకృష్ణుని ఉత్సవమూర్తిని కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కర్నాలవీధి గుండా భేరీవీధిలోని వరదరాజులస్వామి ఆలయం వద్దకు చేరుకున్నాక ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్లోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న ట్రాక్టర్
ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు స్వర్ణముఖి కాజ్‌వే సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మేనకూరుకు చెందిన శరవణ, సాయి మోటారు సైకిల్‌పై బుధవారం సాయంత్రం మేనకూరుకు వెళ్తుండగా స్వర్ణముఖి కాజ్‌వే వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శరవణ, సాయి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గూడూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది వుండటాన్ని స్థానికులు గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల వివరాల మేరకు... సీవీసీ పార్కు రోడ్డులో 50 ఏళ్ల వయస్సు కలిగిన నల్లగళ్ల చొక్కా, బ్రౌన్‌రంగు ప్యాంటు ధరించిన వ్యక్తి మృతి చెందాడు. అతను గత కొంతకాలంగా పట్టణంలో సంచరిస్తూ చిత్తు కాగితాలు, ఖాళీ బాటిళ్లు సేకరించి అమ్ముకుని జీవనం సాగించేవాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

దారికాచి దాడి

తడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ ఆటలో జరిగిన చిన్నపాటి గొడవను మనసులో పెట్టుకుని దారికాచి దాడిచేశారు. మండల పరిధిలోని రామాపురంకుప్పం సమీపంలో ఆదివారం కబడ్డీ పోటీలు జరిగాయి. పలు గ్రామాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు ఆరంబాకం నొచ్చుకుప్పం జట్టు, రామాపురం కుప్పం జట్టు మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో రామాపురం కుప్పం ఆటగాళ్లు నొచ్చుకుప్పం జట్టు సభ్యులపై దాడి చేశారు. దీంతో ఆగ్రహించిన నొచ్చుకుప్పం గ్రామస్తులు బుధవారం బుధవారం ఉదయం రామాపురం కుప్పం గ్రామానికి చెందిన జాన్సన్ శ్రీసిటీలో పనులకు వెళ్తుండగా జీరోపాయింట్ దగ్గర దారికాచి దాడి చేశారు. గాయపడ్డ జాన్సన్‌ను చెన్నై ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఇరుగ్రామాల మత్స్యకార పెద్దలు జోక్యం చేసుకుని రెండు వర్గాల మధ్య రాజీ చేశారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కూలీ మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కూలీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. వెంకటాచలం మండలం కసుమూరు గ్రామానికి చెందిన మస్తానయ్య(56) ధాన్యం కాటాల వద్ద కూలిపనుల నిమిత్తం మరో 5 మందితో కలసి నాయుడుపేటకు వచ్చారు. పనులు ముగిసిన అనంతరం మంగళ వారం రాత్రి నాయుడుపేట పాతబస్టాండ్ సమీపంలో వెళ్తుండగా మస్తానయ్యను ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మస్తానయ్యను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మస్తానయ్య మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరి బైండవర్

కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోట క్రాస్‌రోడ్డు, గూడలి గ్రామాలకు చెందిన ఇద్దరిని మద్యం విక్రయం కేసులో బుధవారం తహసీల్దారు జయజయరావు ఎదుట ఎక్సైజ్ అధికారులు బైండ్‌వర్ చేశారు.

దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి

గూడూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నిలిపివేసిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల కారణాలతో జిల్లాలో 33 వేల మంది దివ్యాంగులకు పింఛన్లను రద్దు చేయడం సమంజసం కాదన్నారు. రద్దు చేసిన పింఛన్లను తిరిగి అందిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, సీవీఆర్‌కుమార్, నారాయణ, వెంకటయ్య, సుబ్రహ్మణ్యం, నాగార్జున, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం పేదలకు దుస్తులు, ఆహర పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళీ నాయుడు, వెంకటేశ్వర్లు, నాగరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



రైతుల వద్ద ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి ప్రసాద్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిద్ధవరం, యాతలూరు సచివాయాల పరిధిలోని రైతులకు ఈ క్రాప్ పంట నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ అందకపోతే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. పంట మార్పిడి తరువాత పచ్చిరొట్ట విత్తనాలు వేస్తే మంచి భూసారం పెరుగుతుందన్నారు. అలాగే ఎరువులు, పురుగు మందులు తగు మోదాలో వేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. పురుగు మందులు కొనుగోలు చేసేప్పుడు డీలరు వద్ద బిల్లులు ఖచ్చితంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పలు గ్రామాల్లోని వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ అనసూయ, ఏవోలు సుజాత, ప్రవీణ, గ్రామ వ్యవసాయ సహాయకులు గురు బ్రహ్మం, మానస, అశోక్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతోనే రాయితీలు

నాయుడుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ - పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీలకు అందుతాయని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. బుధవారం మండలంలోని పుదూరు, పూడేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎంటల సాగుపై రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం రైతులకు జీలగలను అందజేశారు. కార్యక్రమంలో నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూముల వేలం

వాకాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపిలి పంచాయతీ జువ్వినట్టు సమీపంలో ఉన్న అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం భూములను కౌలుకు ఇచ్చేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త తిరుమూరు సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. 98.80 ఎకరాలను ఏడాది కాలపరిమితికి రూ.25.95 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, తూపిలిచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ ఇవ్వకపోతే... భారం మోయలేం

కోట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు, పాఠశాలలకు రేషన్ దుకాణాల ద్వారా సరఫరా అయ్యే బియ్యానికి సంబంధించి ఏడేళ్లుగా కమీషన్ ఇవ్వలేదని, ఇంకా అదనపు భారం మోయలేమని డీలర్లు తేల్చి చెప్పారు. బుధవారం తహసీల్దారు జయజయరావు మండలంలోని రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీలు, పాఠశాలలకు సరఫరా చేసిన బియ్యానికి కమీషన్ ఇవ్వాల్సి ఉందని, పలుమార్లు అడుగుతున్నా పట్టించుకోవడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి వీఆర్వోల సమక్షంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. పంపిణీలో నిర్లక్ష్యం చేసినా, సమావేశాలకు హాజరుకాకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీటీ మల్లికార్జునరావు, సివిల్ సప్లయిస్ డీటీ అజ్మతుల్లాఖాన్, డీలర్లు పాల్గొన్నారు.

తడ సొసైటీ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి బాధ్యతల స్వీకారం



శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న అధికారులు

తడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తడ సొసైటీ ఛైర్మన్‌గా వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులుగా సుధాకర్, రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వారిని ఎన్‌డీసీసీబీ మేనేజర్ రాజు, సూపర్‌వైజర్ చాన్‌బాషా, సీఈవో రామయ్య, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్ తదితరులు శాలువాలతో సత్కరించారు.

నేడు ఎమ్మెల్యే కురుగొండ్ల కమ్మపల్లి పర్యటన

డక్కిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం డక్కిలి మండలం కమ్మపల్లిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలిపారు. నూతనంగా నిర్మించిన మాధవాయపాళెం సొసైటీకి చెందిన గోదాములను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు.

రాజీవ్ గాంధీకి నివాళి



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని బుధవారం సూళ్లూరుపేటలో నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నేత మావుదూరు వెంకటచలపతి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్దెపూడి రాజారెడ్డి, బాలరాజురెడ్డి, జానకిరామ్, భాస్కర్‌రెడ్డి, దేవదానం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సుబ్బరామరాజు, బ్రహ్మయ్య, వేమయ్య, మూర్తి పాల్గొన్నారు.